www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 24 జులై 2023
5
అన్నమయ్య

నేడు యథావిధిగా స్పందన

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం – స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

కూర 'గాయాలు'

- ఆకాశానికి నిచ్చెన వేసిన ధరలు
- కొండెక్కిన టమోటా, అల్లం
- ఘాటెక్కిన పచ్చి మిర్చి
- కొనలేకపోతున్న సామాన్య, మధ్య తరగతి ప్రజలు
- అధిక ధరలతో తగ్గిన వ్యాపారాలు

చూస్తుండగానే కూరగాయల ధరలు రెట్టింపు కావడంతో వినియోగదారులు విలవిలాడుతున్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి, దిగుమతి లేకపోవడానికి తోడు వర్షాలు లేకపోవడంతో కూరగాయల ధరలు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. రోజు రోజుకు ధరలు ఎగబాకడంతో ప్రజల గుండెల్లో గుబులు మొదలైంది. 20 రోజుల కిందట రూ.150కు వచ్చిన సరుకులు ఇప్పుడు రూ.500 పట్టుకెళ్లినా రావడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది. జిల్లాలోని మార్కెట్లలో ఆకాశానంటిన ధరలు చూపి ప్రజలు బేజారెత్తిపోతున్నారు.

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మార్కెట్లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. కొనలేక పచ్చడి మెతుకులే గతయ్యాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలో టమాటా రూ.120 నుంచి 150 వరకు పలుకుతుంది. కిలో బీన్స్ రూ.120 కాగా, పచ్చి మిర్చి రూ.100 ఉండగా కాకరకాయ, బీరకాయ, బీట్రూట్, వంకాయల ధరలు రూ.50 పైబడి ఉన్నాయి. కూరగాయల ధరలు పెరగడానికి గత నెలలో ఎండలు విపరీతంగా పెరిగిపోవడం అలాగే బయట రాష్ట్రాలలో కురుస్తున్న వానలే కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు. వానలతో కూరగాయల దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. పైగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఉత్పత్తి తగ్గిపోయి ధరల పెరుగుదలకు కారణమైనట్లుగా తెలుస్తుంది. కూరగాయల ధరలు కొండెక్కడంతో ప్రజలు కొనలేకపోతున్నారు. వ్యవసాయ బోర్ల ద్వారా సాగుచేసే తోటలకు నీటి తిప్పలు పట్టుకుంది. సాగుచేసిన కూరగాయల దిగుబడి తగ్గిపోయి ప్రభావం వాటి ధరలపై పడ్డాయని రైతులు చెబుతున్నారు. ఇప్పుడిప్పుడే తొలి వర్షాలు పడుతున్నాయని పంట వేసిన రెండు నెలల తర్వాత పంట చేతికి వస్తాయని తర్వాత ధరలు తగ్గే అవకాశం ఉందని పలు వురు వ్యాపారులు పేర్కొం టున్నారు.

కూరగాయలు (కిలో)	ధరలు
టమోటా	రూ.120
పచ్చి మిర్చి	రూ.100
బీన్స్	రూ.120
కాకరకాయ	రూ.80
బీరకాయ	రూ.80
బెండకాయల	రూ.40
ముల్లంగి	రూ.35
క్యాబేజీ	రూ.40
బీట్రూట్	రూ.60
ఉల్లిగడ్డలు	రూ.30
వంకాయ	రూ.50

దిగుబడి తగ్గి.. ధరలు పెరిగి..

గత నెలలో ఎండలు విపరీతంగా ఉండడంతో భూగర్భజలాలు అడుగంటిపోయి సాగు చేసిన కూరగాయల పంటలకు నీరు అందక పోవడంతో ఆ ప్రభావం దిగు బడిపై పడింది. కూరగాయల ధరలు నిలకడగా ఉంటా యని భావించిన రైతులు చాలా మంది అనేక గ్రామాల్లో కూరగాయల సాగుకు ముందు కొచ్చారు. వ్యవసాయ బోర్లలో అరకొరగా వస్తున్న నీటితో కూరగాయలను సాగు చేస్తూ వచ్చారు. వర్షాభావ పరిస్థితులతో బోర్లలో నీరు అడుగంటిపోయి సాగు తగ్గిపోయింది. దీంతో కూరగాయల ధరలు ఆకాశన్నంటాయి.

కొనేవారు లేక వెలవెలబోతున్న కూరగాయల మార్కెట్

ధరలు రెట్టింపయ్యాయి

కూరగాయల ధరలు రెట్టింపయ్యాయి. మూడు వారాల కిందట తక్కువగా ఉన్న ధరలు ఒక్కసారిగా కొండెక్కాయి. రేట్లు ఆకాశన్నంటడంతో పేద, మధ్య తరగతి, సామాన్యులు కూరగాయలు కొని తినలేని పరిస్థితి ఏర్పడింది. ధరలు ఎప్పుడు తగ్గుతాయా అని ఎదురు చూస్తున్నాం.

-యం.కృష్ణ, రాయచోటి

సంపాదనంతా కూరగాయలకే సరిపోతుంది

రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్ము కూరగాయలకే సరిపోతుంది. బజారులోకి రూ.500 తీసుకెళ్తే వారానికి సరిపడే కూరగాయాలు రావడం లేదు రూ.20 ఉన్న టమాట ధరలు ఒక్కసారిగా రెట్టింపు అయ్యింది. కూరగాయలు కొనాలంటేనే జేబులు తడుముకోవాల్సి వస్తుంది. సంపాదనలో సగం డబ్బులు కూరగాయలకే పోతే మిగిలిన నిత్యావసరాలు ఎలా తీసుకోవాలి.

- సతీష్ రాయల్, రాయచోటి.

మోడీ పాలనలో మైనార్టీలకు రక్షణ కరువు

- మణిపూర్ ఘటనకు నిరసనగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో

ప్రజాశక్తి-పీలేరు

దేశంలోని మోడీ పాలనలో ఎస్సి, ఎస్టి, క్రైస్తవ, మైనార్టీలకు రక్షణ కరువైందని ప్రజాసంఘాలు అగ్రహం వ్యక్తం చేశాయి. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాల మహా హానాడు మండల ప్రచార కార్యదర్శి దప్పేపల్లి అనంద్ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు మదనపల్లి – తిరుపతి జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ, క్రైస్తవ, మైనార్టీలపై రోజు రోజుకూ దాడులు అధికమవుతున్నాయని అన్నారు. మణిపూర్‌లో గిరిజన మహిళలపై హత్యాచారాలు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన ఘటన సామాన్యునే కాకుండా సుప్రీంకోర్టు న్యాయమూర్తులను సైతం దిగ్భ్రాంతికి గురి చేసిందని చెప్పారు. మణిపూర్‌లో పరిపాలన చేతకాక గత రెండు నెలలుగా బిజెపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనం వహించి నీచ రాజకీయాలు చేస్తున్న కారణంగా అక్కడ శాంతి భద్రతలు కరువయ్యాయని పేర్కొన్నారు. అసాంఘిక శక్తుల దురాగతాలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. అక్కడి ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడాల్సిన పోలీ సులు, పారా మిలటరీ దళాలు చేష్టలుడిగి చోద్యం చూస్తున్నాయని ఆరోపించారు. మణిపూర్‌లో మానవత్వం మంటకలిసిందని, పశుత్వం పెచ్చు పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క బిజెపి పాలనలో తప్ప మన దేశ ప్రతిష్ట ఇంతగా ఎప్పుడూ దిగజారలేదని వాపోయారు. కార్యక్రమంలో జాస్ జిల్లా మహిళా అధ్యక్షులు గుండ్లూరు రాజేశ్వరి, మైనార్టీ మండల అధ్యక్షులు పఠాన్ హసీనా, ముస్లిమ్ జెఎసి నాయకులు పఠాన్ మౌలా, అమీర్, మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, విసికె పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు, బిఎస్‌పి పీలేరు నియో జకవర్గ ఇన్‌ఛార్జి చీకటిపల్లి ఎర్రప్ప, ఎపిఎం ఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు వేల వారు గురునాధం, రాష్ట్ర పంచాయతీ రాజ్ కార్మికుల సంఘం అధ్యక్షులు ధనాసి వెంకట్రాయ్య, మాల మహాసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లిగారి వెంకటస్వామి, మాలమహానాడు అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున, జాస్ జిల్లా లీగల్ అడ్వయిజర్ గుండ్లూరు సదాశివ, మచ్చ రెడ్డప్ప, ముస్లిమ్ జెఏసి నాయకులు ఖాదర్ వల్లి, సాదిక్, మౌలాలీసాహెబ్, తమీమ్, మేముసైతం సంస్థ వ్యవస్థాపకులు షాహిన్‌షా మోదిన్ బాష, జాస్ జిల్లా నాయకులు ముల్లంగి క్రిష్ణయ్య, పీలేరు నియో జకవర్గ అధ్యక్షులు ఎర్రబల్లి మల్లికార్జున, ఆరమ డకల నాగరాజ, జాస్ నాయకులు మల్లికార్జున, సురేంద్ర, శంకర్, పాల్గొన్నారు.

మదనపల్లి-తిరుపతి జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పశు వ్యాధుల నివారణే లక్ష్యం

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పెళ్లై

ముఖా ముఖి..

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలోని రైతులకు అందుబాటులో ఉండి పశువుల వ్యాధుల నివారణకు కృషి చేస్తున్నానని పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పెళ్లై పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో పాడి రైతులు పశువుల పెంపకం ద్వారా పాలు దిగుబడితో అధిక లాభాలు, పశువుల వ్యాధుల ఎలా నివారించాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో తెలియజేశారు.

అన్నమయ్య జిల్లాలో పశు సంవర్ధక శాఖ కేంద్రాల వివరాలు తెలపండి?

జిల్లాలోని 6 నియోజకవర్గాలు, 30 మండలాలు, 3 డివిజన్లలో రాయచోటి, మదనపల్లె, రాజంపేటలో 3 ఉపసంచాలకులున్నారు.3 డివిజన్లో 15 మంది సహాయ సంచాలకులు (ఎడిలు), పశువైద్యాధికారులు 71 మంది, గ్రామీణ పశువైద్య అధికారులు 63 మంది ఉన్నారు.399 రైతు భరోసా కేంద్రాలలో పశువు వైద్య సహాయకులు, 116 మంది గోపాలమిత్రలున్నారు.

జిల్లాలో పశు సంపదలు వివరాలు తెలపండి ?

జిల్లా వ్యాప్తంగా తెల్ల పశువులు 2,76,417, గేదెలు 100588, గొర్రెలు18,24,325, మేకలు 3,53,370, కోళ్లు 23,82,260, కోళ్లఫారాలు మదనపల్లె, పీలేరు, కలికిరి ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి.

పశువులకు ఎలాంటి వైద్య సేవలు అందజేస్తున్నారు?

ఇటీవల కాలంలో దాదాపు గొర్రెలు, మేకలకు సామూహిక నట్టల నివారణ మందులను తాగించాం. పశువైద్యు అధికారులు రైతుల దొడ్డలి దగ్గరికి వెళ్లి ఉచితంగా మందులు తాగించారు. దాదాపు జిల్లాలో 18 లక్షల గొర్రెలకు,3 లక్షల మందులు అందజేశాం. గొర్రెలు, మేకలు ఆరోగ్య పరీక్షలు , నీలి నాలుక వ్యాధి నివారణ కోసం టీకాలను సిద్ధంగా ఉంచాం.వైఎస్ఆర్ సంచార వైద్యం ద్వారా మారు మూల ప్రాంతాలలోని పశువులకు సేవలు అందిస్తారు. 1962 నెంబర్‌కు కాల్ చేస్తే తమ సిబ్బంది వ్యాన్‌లో రైతుల దగ్గరికి వెళ్లి వ్యాధిని బట్టి వాటికి మందులను అందజేస్తున్నారు.

చర్మ వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

2019 సంవత్సరంలో కడపలో లంపు చర్మ వ్యాధుల నమోదు అయ్యాయి. 2021– 22 సంవత్సరానికి దాదాపు ఒక శాతం మాత్రమే పశువులు చర్మ వ్యాధుల బారిన పడ్డాయి. జిల్లాలు ఎక్కడా పశువులు మరణించలేదు. ముందస్తు భాగంగా ఇప్పటివరకు 55,500 పశువులకు టీకాలు వేశాం. 2లక్షల 30 వేల టీకాలు పశువులకు వేశాం. వ్యాధిని అరకట్టేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో పశువుల సంతలను మూసి వేశాం. మదనపల్లె వంటి ప్రాంతాలలో చెక్ పోస్ట్‌ను ఏర్పాటు చేశాం. గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా స్థాయి వరకు రైతులకు అనేక అవగాహన సదస్సును వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం ఎలాంటి చర్మ వ్యాధులు నమోదు కాలేదు. వైఎస్ఆర్ సంకర పశు వైద్య వాహనలు జిల్లాల్లో 13 ఉన్నాయి. నియోజకవర్గానికి 2 చొప్పున జిల్లా కేంద్రంలో 3 అందుబాటులో ఉన్నాయి.

గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి?

2022 – 23 సంవత్సరంలో 370 టన్నులు విత్తనాలు రైతులకు అందజేశాం. సంవత్సరాలు 2023 – 24 సంవత్సరానికి 500 టన్నులు 4 రకాల గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. సిఎస్ హెచ్ – 24 ఎర్ర జొన్నలు, ఆఫ్రికన్ మొక్కజొన్నలు, అలసందలు, సజ్జలు అందుబాటులో ఉన్నాయి. 75 శాతం రాయితీతో అందజేస్తున్నాం.గడ్డి విత్తనాలను అన్ని రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచాం.

నిరుద్యోగులు ఉపాధి ఆదాయం పొందవచ్చా ?

గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగులు, విరమణ పొందిన ఉద్యోగులు ఇతరులు జిల్లాలో పాడి పరిశ్రమ ఎంతో ఉపయోగపడుతుంది. పాడి పెంపకం ద్వారా పాలతో ఆర్థిక లాభాలు సాధించవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పాల డెయిరీలు అందుబాటులో ఉన్నాయి. పాల వ్యాపారంతో అధిక దిగుబడి సాధించవచ్చు. దీని వల్ల నిరుద్యోగ ఉపాధి కలుగుతుంది.

రైతులు అధిక దిగుబడి సాధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా సంకర జాతి దూడను పొంది మంచి పాడి పశువుల ద్వారా అధిక పాలు ఉత్పత్తిని సాధించవచ్చు. జగనన్న పాలవెల్లువ కింద కొన్ని గ్రామాలను చేర్చి, గిట్టుబాటు ధరను కల్పి స్తున్నాం. పశుదానా వినియోగం, మూడు రకాల పచ్చ గడ్డలు మార్గం ద్వారా విధిగా ఎండ గడ్డి, వ్యాధి నివారణకు పశుసంవర్ధక శాఖ సలహాలు, సూచనలు ఇస్తున్నాం. ప్రస్తుతం రోజుకు దాదాపు 40 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతుంది.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తూ సమాజాన్ని పెడదోవ పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని డిఎస్‌పి కె. కేశప్ప తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలంలో జూదరులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌పి ఆర్.గంగాధర్ రావు ఆదేశాల మేరకు మదనపల్లి సబ్ డివిజనల్, సివిల్ ఎస్‌టిఎఫ్ ఏర్పాటు చేసి కచ్చితమైన సమాచారంతో సబ్ డివిజనల్ పరిధిలోని అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచి దాడులు చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా తమ వచ్చిన సమాచారం మేరకు రామసముద్రం మండలం యలవ నెల్లూరు పంచాయతీ దాసార్లపల్లి గ్రామం వద్ద కర్ణాటక సరిహద్దులో మల్లికార్జునరెడ్డి అలియాస్ అర్జునరెడ్డి, నాగరాజా అలియాస్ అరటికాయల రాజా అనే వ్యక్తులు ఆర్గనైజ్ గాంబ్లింగ్ నిర్వహిస్తుండగా మదనపల్లి రూరల్ సిఐ ఓ. శివాంజనేయులు , రామసముద్రం ఎస్ఐ సి. చంద్రశేఖర్, సబ్ డివిజనల్ స్పెషల్ పార్టీ బృందం ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారని చెప్పారు. 11 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 47,150 నగదు,1 7 ద్విచక్ర వాహనాలు, 12 మొబైల్ ఫోన్లు, ఐదు బంగారు ఉంగరాలు మూడు వెండి చైన్లు, రెండు వెండి కడియాలు, ఒక వెండి ఉంగరం, ఒక వాచ్ స్వాధీనం చేసుకొని గాంబ్లింగ్ యాక్ట్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని చెప్పారు. ఇందులో ఆర్గనైజర్లతో పాటు సుమారు 30 మంది పరారీలో ఉన్నారని తెలిపారు. డంప్ కాల్స్ ద్వారా మిగిలిన పేకాటరాయుళ్లను కూడా గుర్తించి వారిని కూడా త్వరగా అరెస్టు చేసి వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని చెప్పారు. . జూదం ఆడటం వల్ల చాలా కుటుంబాలు నాశనమవుతున్నాయని, తద్వారా ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని తెలిపారు. ఈ బెట్టింగుల వల్ల చాలామంది అప్పుల చేయడం ఇళ్లలో ఉన్న వస్తువులు, టూ వీలర్స్‌ను కూడా తాకట్టు పెట్టి అప్పుల పాలై జీవితాలు నాశనం అవుతున్నాయని తెలిపారు. జూదరులు ఇకనైనా తమ పద్ధతి మార్చుకోకుంటే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని జూదరులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

జూదర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డిఎస్‌పి కేశప్ప

క్షతగాత్రులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి -రాజంపేట రూరల్

చిన్న ఓరంపాడు వద్ద జరిగిన లారీ, బస్సు ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులను రాజంపేట జనసేన పార్టీ నాయకులు అతికారి దినేష్ పరా మర్శించారు. వారికీ పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు, పౌష్టికాహారం, కిట్లను అందజేశారు ప్రమాదంలో రాజ ంపేట నియోజకవర్గ జనసైనికుడు ఏనుగుల మల్లి తండ్రి ఏనుగుల శంకరయ్య తీవ్రంగా గాయపడడంతో అతని కుటుంబ సభ్యులకు రూ. 10 వేల ఆర్థిక సాయం, అలాగే బస్సు కండక్టర్ బాల వెంకటేష్ కుటుంబానికి మరో రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా అతికార దినేష్ మాట్లాడుతూ తరచూ ఇలాంటి రోడ్డు ప్రమాదాలలో అనేకమంది ప్రాణాలు కోల్పోవడం, గాయపడడం చాలా బాధాకరమైన విషయమని ఆర్టీవో అధికారులు ఈ వేగంపై నియంత్రణ చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్య సాయం తక్షణమే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా కాపునాడు అధ్యక్షులు సింగనమల శ్రీనివాసులు, హేమంత్, అంద్రు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శిస్తున్న జనసేన నాయకులు

రోడ్డు ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

రాజంపేట అర్బన్ : శనివారం ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద బాధితులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాజంపేట నియోజకవర్గ బాధ్యులు పూల భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రమాదానికి లారీ డ్రైవర్ మద్యం మత్తులో వాహనాన్ని నడిపి ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమయ్యాడని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, తీవ్ర గాయాలైన వారికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు.

23 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి- రాయచోటి

మండల పరిధిలోని చెన్నముక్కపల్లి లయన్స్ కంటి ఆసుపత్రిలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో ఆదివారం 23 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. నియోజకవర్గంతో పాటు, జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వే కోడూరు, ఎర్రవారి పాలెం, కె.విపల్లె, కలకడ, కలికిరి, గుర్రంకొండ,పెద్దమండెం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించారు. అర్హులైన కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా,అద్దాలు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఐసీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి,లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ శివరామిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాష, కడప మానస హోటల్ యజమాని చిన్నపరెడ్డి, లయన్ సభ్యులు రాఘవేంద్ర వర్మ, గోగుల కొండారెడ్డి, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు మిఠాయిగిరి ఖాసింసాబ్, కంటి వైద్యులు సురేష్ బాబు, మహాలక్ష్మి, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ సుధాకర్‌రెడ్డి

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

లయన్స్ క్లబ్ పట్టణ నూతన కార్యవర్గ ఏర్పాటైంది. ఆదివారం ఫాయాజ్ ఫంక్షన్ హాల్‌లో ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా లయన్ నిర్మల్ కుమార్, కార్యదర్శిగా లయన్ ఇందాద్ అహమ్మద్, కోశాధికారిగా లయన్ హరీష్ చంద్ర ఎన్నిక అయ్యారు. అనంతరం ఫాస్ట్ జిల్లా గవర్నర్ సుధాకర్ రెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరంలో 650 సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమని చెప్పారు. రాయచోటి ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, వీటి చూసి మరి కొంతమంది లయన్స్ క్లబ్‌లో భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. ఐదు సంవత్సరాలుగా చేసిన సేవలకు భిన్నంగా రాయచోటి పేద ప్రజలకు సేవ చేయడానికి నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు నిర్మల్ కుమార్ లైన్స్ క్లబ్ ఆఫీస్ కోసం రూ.10 లక్షలు విలువైన స్థలాన్ని ప్రకటించడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్స్ చిన్నప్పరెడ్డి సిహెచ్ రమేష్ నాథ్ రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ భయ్యారెడ్డి, లక్కిరెడ్డిపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్, ఫయాజ్ ఫంక్షన్ హాల్ అధినేత ఫయాజ్, తాడిపత్రి కడప పులివెందుల లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.ఏ.కరీముల్లా

గౌరవ వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ముస్లిం మైనార్టీలు, మస్జిద్ కమిటీ ప్రెసిడెంట్లు,సెక్రెటరీలకు వక్ఫ్ బోర్డ్, ఆంధ్రప్రదేశ్ మసీద్ పేష్ ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజంలకు రూ.5 వేలు చొప్పున మసీదులకు గౌరవ వేతనాలను ప్రతినెలా మసీదు ఖాతాలకు చెల్లించేందుకు కలెక్టర్ పి.ఎస్.గిరీషా ప్రకటన విడుదల చేశారని అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ. కరీముల్లా తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో గౌరవ వేతనాలు పొందని 99 మసీదుల ప్రెసిడెంట్లు, సెక్రటరీల నుంచి దరఖాస్తులు తీసుకొని వక్ఫ్ బోర్డ్ విజయవాడ కార్యాలయానికి పంపించామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి గౌరవ వేతనాలు పొందుతున్న మసీదులు, దరఖాస్తులు ఇచ్చిన మసీదులు కాకుండా ఆదాయం లేని, దరఖాస్తులు సమర్పించని మసీదుల ప్రెసిడెంట్లు,సెక్రెటరీలు తమ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మసీదు పేరిట బ్యాంక్ ఖాతా తెరిచిన పుస్తకం, , ఇమామ్,మౌజంల ఆధార్ కార్డులు, సెల్ నంబర్,వ ుసీదు కమిటీ ప్రెసిడెంట్ ఆధార్ కార్డు,సెల్ నెంబర్ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.

నల్లారి కిషోర్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు

-రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పారదర్శకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తప్పుపడుతున్న పీలేరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ వైసిపి బిసి సెల్ కార్యదర్శి రాయుడు, జగ్రావారిపల్లి సర్పంచ్ మునిభాస్కర్ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నడం విడ్డూరంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం దాదాపు రూ. రెండు లక్షల కోట్లు అప్పులు చేసిన విషయాన్ని మరచిపోయి మాట్లాడడం కిషోర్ కుమార్ రెడ్డి తగదన్నారు. టిడిపి పాలనలో చంద్రబాబు నాయుడు చేసిన అప్పులతో పోల్చుకుంటే, ప్రస్తుత సిఎం చేసినవి తక్కువేనన్నారు. గతంలో చంద్రబాబు చేసిన అప్పులు వారి నాయకుల జేబులు నింపగా, ప్రస్తుత సిఎం చేసిన అప్పులు సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లోకి జమ అవుతున్నాయని చెప్పారు. ఇంతకాలం హైదరాబాదులో కూర్చున్న కిషోర్ కుమార్ రెడ్డి ఎన్నికలు వస్తుండడంతో నియోజకవర్గానికి వచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో విఠలం మాజీ సర్పంచ్ సురేష్ కుమార్ రెడ్డి, నాయకులు ఆనంద్, చలపతి, గురుమూర్తి పాల్గొన్నారు.

తులసిరెడ్డికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

రైతులకు రూ.6 లక్షల రుణమాఫీ

-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం వస్తే రైతులకు రూ.6 లక్షలు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మెన్ ఎన్. తులసిరెడ్డి అన్నారు. ఆదివారం అనంతపురం గ్రామపంచాయతీ ఈడిగాపల్లి పల్లెలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి అల్లాబకాష్ ఆధ్వర్యంలో పది కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ముఖ్య అతిథులుగా తులసిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు వ్యతిరేకంగా ఉన్నారని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేక వ్యవసాయం పై ఆసక్తి తగ్గి అప్పులలో కూరుకుపోయి ఆత్మహత్యలు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో రైతు ఆత్మహత్యలు రాష్ట్రం మూడో స్థానంలో ఉందన్నారు. కౌలు రైతు ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉంద న్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్ అందిస్తుందని తెలిపారు. మణిపూర్‌లో జరుగుతున్న మరణకాండ మోడీ ప్రభుత్వానికి పార్టీ పట్టినట్లు ఉందని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన కుటుం బాలు షేక్ అమీర్, షేక్ మహబూబ్ బాషా, షేక్ రమీజా, ఇనయ్ తుల్లా, హుస్సేన్ బాషా, వీరబల్లి మల్లయ్య, మస్తానయ్య, రాజశేఖర్, తుమ్మల సతీష్ కుమార్, వెంకటరమణ,ఎల్లప్ప, బుక్కే. రామతులసి వీరితోపాటు పది కుటుం బాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో చిన్న రెడ్డయ్య, రఫీ, చెన్నక్రిష్ణ ఖాదరవల్లి, అమర, ఉత్తన్న, మంజునాథ, ఖాదర్ ఖాన్, నరేష్, వైవి రమణమ్మ, లతా, మహబూబ్‌జాన్, ఉభయుతుల్లా, ఓబులేసు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యం కోసం ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక ఇందిరమ్మ కాలనీలో గల అబ్బాస్‌అలీ కుటుంబానికి ముస్లిం మైనార్టీ యువ నాయకుడు వేంపల్లి బావాజీ రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీకి చెందిన అబ్బాస్ అలీకి ఇటీవల ప్రమాదవశాత్తు కాలు విరిగినట్లు తెలియగానే వెంటనే స్పందించి ఉదార భావంతో ముస్లిం మైనార్టీ యువనాయకుడు వేంపల్లి బావాజీ, అబ్బాసలీం భార్య షకీనాకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. పేద కుటుంబంలో జీవిస్తున్నటువంటి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కలికిరి మేజర్ పంచాయతీ వార్డు మెంబర్ సయ్యద్, బూత్ కన్వీనర్ మధు పాల్గొన్నారు.

వివాహవేడుకల్లో చమర్తి జగన్మోహన్‌రాజు

వివాహవేడుకల్లో 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నియోజకవర్గ సీనియర్ టిడిపి నాయకులు చమర్తి జగన్మోహన్ రాజు ఇటీవల వివాహమైన జయబాలకిషోర్, తేజశ్రీ దంపతుల రిసెప్షన్ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ కల్లుగీత కార్మిక రాష్ట్ర డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య, యువ నాయకులు బండారు బాలయ్య, పరశురాం నాయుడు, హరినాథ్‌రెడ్డి, సూర్యనారాయణ రాజు, శేషారెడ్డి, మైనారిటీ నాయకులు కరీముల్లా, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి సుహేల్, గురు నాయుడు, సురేష్, శుభాన్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఏడు గొర్రెలు మృతి

-ఆర్థికంగా ఆదుకోవాలని రైతు వేడుకోలు

ప్రజాశక్తి -బి.కొత్తకోట

గొర్రెల పాకపై కుక్కల దాడి చేయడంతో ఏడు గొర్రెలు మృతి చెందిన సంఘటన నగర పంచాయతీ పరిధిలోని డేగానిపల్లిలో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా బాధిత రైతు సురేష్ మాట్లాడుతూ రాత్రి వేళలో తాను పోషించుకుంటున్న గొర్రెలను పాకలో ఉంచగా, సుమారు ఏడు గొర్రెలపై కుక్కలు విచక్షణారహితంగా దాడి చేశాయని, ఈ దాడిలో ఏడు గొర్రెలు మృత్యువాత పడ్డాయన్నారు. ఉదయం 6 గంటల సమయంలో తాను గమనించానని, మరో అయిదు గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. గొర్రెలు విలువ రూ.80 వేలు ఉంటుందని తెలిపారు.ప్రభుత్వం, అధికారులు స్పందించి తన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు వేడుకుం టున్నారు. నగర పంచాయతీ పరిధిలో కుక్కల బెడద ఎక్కువవుతోందని, నగర పంచాయతీ అధికారులు పట్టించకపోవడంతో కుక్కలు సంఖ్య అమాంతం పెరిగిపోయి, పిల్లలు ప్రజలపై దాడి చేస్తున్నాయని అన్నారు. కుక్కల నిర్మూలన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు పంచాయతీ అధికారులను కోరారు.

రేపు విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి-పెద్దమండెం

వైసిపి ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జూలై 25న టిఎన్ఎస్ఎఫ్ చేపడుతున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బోడెం భాను యాదవ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల పెంపుపై చర్యలు తీసుకోవాలని కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు మాత్రమే వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని పునరుద్ధించాలి, అదేవిధంగా అమ్మ ఒడి పథకం అందరి పిల్లలకు వర్తింప చేయాలన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అలుపెరగని కృషి చేస్తానని ఎస్‌టియు జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎం.భాస్కర్‌రెడ్డిని ఆదివారం మండల శాఖ ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అసోసియేట్ అధ్యక్షులు పోకల మధుసూదన్, రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి.రమణ డివిజనల్ కన్వీనర్లు నరసింహ, విద్యాధర్‌రావు, మండలాధ్యక్షుడు రమేష్ బాబు, జనరల్ సెక్రెటరీ కె.రఘునాథ్ పాల్గొన్నారు.

కడప పార్లమెంట్ కాపునాడు అధ్యక్షులుగా 'ఆకుల'

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప పార్లమెంట్ కాపునాడు అధ్యక్షు లుగా మండలంలోని బొందలకుంట గ్రామానికి చెందిన ఆకుల రవికుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కాపునాడు కార్యవర్గం ఆదేశానుసారం రాయలసీమ జోన్ అధ్యక్షులు గంగల వీరాంజ నేయులు సలహా మేరకు జాతీయ అధ్యక్షులు గాళ్ళ సుబ్రహ్మణ్యం తనను కడప పార్లమెంటు అధ్యక్షులుగా నియమించినట్లు చెప్పారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల సమస్యలపై తన వంతు పోరాటం చేస్తానన్నారు. వారికి అన్ని విధాలా అండగా నిలిచి చేతనైన సహాయ సహకారాలు అందిస్తానన్నారు. త్వరలో కడప పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాలు పర్యటించి, బలిజ కుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో కడప పార్లమెంటు అధ్యక్షులు పదవి ఇచ్చినందుకు ఆంధ్రప్రదేశ్ కాపునాడు కార్యవర్గానికి, జాతీయ, రాయలసీమ అధ్యక్షులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన వెనుక ఉండి ప్రోత్సహిస్తున్న బలిజ కులస్తులందరికీ రవికుమార్ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.

పడిపోయిన బొప్పాయి ధరలు

ఆందోళనలో కౌలు రైతులు

ప్రజాశక్తి-కలికిరి

బొప్పాయి ధరలు అమాంతంగా పడిపోవడంతో కౌలు రైతులు విలవిలలాడుతున్నారు. పీలేరు నియోజకవర్గం లోని ఆరు మండలాలలో గత 15 సంవత్సరాలుగా రైతులు ఉద్యాన పంటలైన బొప్పాయి, దానిమ్మ పంటను పండిస్తున్నారు. అందులో ముఖ్యంగా కలికిరి మండలంలో అత్యధిక మంది రైతులు బొప్పాయి పంటను పండిస్తుండగా, మరి కొంతమంది రైతులు సుదూర ప్రాంతాలైన కె.వి.పల్లి, రొంపిచర్ల, పీలేరు, పింఛా ప్రాంతాలకు వలస వెళ్లి భూములను కౌలుకు తీసుకొని బొప్పాయి పంటను పండిస్తున్నారు. మొదట బొప్పాయిలో బాగా లాభాలు అర్జించిన రైతులు తర్వాత కాలంలో నాసిరకం విత్తనాలు, ఎరువులు, అధిక పెట్టుబడులు, వ్యాపారుల స్వార్థంతో అన్ని వెరసి నాలుగైదు సంవత్సరాలుగా రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకు పోతున్నారు. ఎన్నో ప్రభుత్వాలు ఉద్యాన పంటలను అభివృద్ధి చేయాలని రైతులకు ఒక ప్రక్క చెబుతున్న ఉద్యాన పంటలను వేయడానికి వారికి కావలసిన సదుపాయాలను కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందారు. రైతులు మామిడి, దానిమ్మ, బొప్పాయి, నిమ్మ వంటి పంటలను పండించడానికి విముఖత చూపుతున్నారు. మండలంలో సుమారు 300 హెక్టార్లలో రైతులు బొప్పాయి, పంటను పండిస్తున్నారు. బొప్పాయి తోటలు ఒకసారి ఒక ప్రాంతంలో వేస్తే రెండవ సారి అక్కడ బొప్పాయి పంటకు పరిస్థితులు అనుకూలించవు, అందువలన దూర ప్రాంతాలకు వెళ్లి అక్కడ భూములను ఎకరానికి రూ.40వేలు చొప్పున చెల్లించి కౌలుకు తీసుకొని పంటలను పండించుకుంటున్నారు. కొంతమంది రైతుల సొంత భూముల్లో పంటలు పండించి తీరా పంట చేతికి వచ్చాక అమ్మే ప్రయత్నంలో దళారులు, వ్యాపారులు కుమ్మక్కై సరైన గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచుతున్నారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో లాభాలు అటు ఉంచితే నష్టాలు బారిన పడి రైతులు ఆర్థికంగా, మానసికంగా కుంగిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం చొరవ తీసుకొని ఉద్యానవన పంటలు సాగుచేసుకునేందుకు రైతులకు కావలసిన సదుపాయాలు కల్పించాల్సిన అవసరముంది. లేకుంటే రాబోవు కాలంలో బొప్పాయి సాగు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుంది.

బొప్పాయి పంట

15 ఏళ్లుగా బొప్పాయి సాగుచేస్తున్నా

గత 15 సంవత్సరాలుగా బొప్పాయి పంటను పండిస్తున్నాను. మొదటలో ఖర్చులు తక్కువగా ఉండేవి కొంత మేర లాభాలు వచ్చేవి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపో యింది. ఎరువులు, కూలీలు విత్తనాలు అధికంగా ధరలు పెరగడంతో పూర్తిగా తగ్గిపో యింది. గత కొన్ని సంవత్స రాలు గా నష్టాలతోనే పంటలు పండిస్తున్నాం. రైతులకు సబ్సిడీ తరహాలో ఎరువులు, విత్తనాలు ప్రభుత్వం అందిస్తే రైతులకు కొద్దిగా వెసలుబాటు ఉంటుంది.

-సిద్దోల్ల బాలకృష్ణ, రైతు కె.బర్నేపల్లి, గుట్ట పాలెం

వ్యాపారులంతా సిండికేట్

వ్యాపారులంతా సిండికేట్ అయి ధరలు పెంచకుండా రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్నారు. దళారీలు కూడా లాభాపేక్షతో రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం చొరవ తీసుకొని రైతు పండించిన పంటను ప్రభుత్వం కొనే విధంగా చర్యలు తీసుకోవాలి.

-సురేష్‌రెడ్డి, రైతు, చీకటిపల్లి

మృతుల కుటుంబాలకు చెక్కులు అందజేత

శ్రీనివాసులు కుటుంబానికి చెక్కు అందిస్తున్న ప్రభుత్వ విప్

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని చిన్న ఓరంపాడు వద్ద శనివారం జరిగిన బస్సు, లారీ ప్రమాదంలో మృతి చెందిన చిన్న ఓరంపాడు పంచాయతీ జ్ఞానంపల్లి దళితవాడకు చెందిన కుండాల శ్రీనివాసులు మృతదేహానికి ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు నివాళులు అర్పించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో నియోజక వర్గ వైసిపి సీనియర్ నాయకులు కొల్లంగంగిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిడి నాగేంద్ర, రాజంపేట ఇంచార్జ్ ఆర్‌డిఒ రంగస్వామి, తహసిల్దార్ పుల్లారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు సర్పంచ్ రమేష్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. **చిట్వేలి:** రోడ్డు ప్రమాదంలో చెవ్వు వెంకట్‌రెడ్డి కుమారుడు అమర్నాథరెడ్డి(26) తీవ్ర గాయాలతో రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, అమరనాథరెడ్డి భౌతిక గాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వెంకట్ రెడ్డి కుటుంబాన్ని ఓదార్చారు. పభుత్వం నుంచి మంజూరైన 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను ఆ కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, మండల వైసిపి కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు ఎల్‌వి.మోహన్ రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, మలిశెట్టి వెంకటరమణ, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ రంగస్వామి, తహశీల్దార్ శిరీష, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు పాల్గొన్నారు. **పుల్లంపేట :** బస్సు, లారీ ప్రమాదంలో గాయపడిన శెట్టిగుంట గ్రామానికి చెందిన సుదీర్‌ను ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆదివారం తిరుపతి ప్రయివేట్‌లో ఆస్పత్రిలో పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

సైనింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలి : ప్రభుత్వ విప్

పుల్లంపేట : ఓబులవారిపల్లి మండల పరిధిలోని చిన్న ఓరంపాడు వద్ద జరిగిన బస్సు, లారీ ప్రమాద స్థలాన్ని ఆదివారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ప్రమాదకరమైన మలుపులు ఉన్నందున సైనింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను, పోలీస్ యంత్రాంగానికి ఆదేశించారు. వాహన దారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని అన్నారు. ప్రమాద ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు సానుభూతిని వ్యక్తపరిచారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిడి.నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షతగాత్రులకు 'మేడా' పరామర్శ

రాజంపేట రూరల్ : చిన్నఓరంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నారాయాద్రి, రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జున్‌రెడ్డి పరామర్శించి వారి ఆరోగ్య స్థితిగతులను వైద్యులతో అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా క్షతగాత్రుల కుటుంబ సభ్యులతో ఆందోళన చెందవద్దని భరోసానిచ్చారు.

రోడ్డు ప్రమాద బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

రాయలసీమ అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రాయలసీమ అభివృద్ధికి మిషన్ రాయలసీమ పేరుతో బృహత్తర ప్రణాళికను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రూపుదిద్దారని టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు అన్నారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో మిషన్ రాయలసీమ కరపత్రాలను టిడిపి నాయకులతో కలిసి కస్తూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లలో రాయలసీమ ప్రాంతానికి ఒక ప్రణాళిక ప్రకారం ఏం చేస్తామో వివరిస్తూ లోకేష్ ఇచ్చిన హామీలను ఆ కరపత్రంలో పొందుపరిచామని అన్నారు. ఉమ్మడి కర్నూలు అభివృద్ధి కోసం, ఉమ్మడి కడప అభివృద్ధి, ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్‌గా ఉమ్మడి చిత్తూరు, ఆటోమొబైల్ హబ్ గా ఉమ్మడి అనంతపురం, అన్నదాత ఆదాయం రెండింతలు చేస్తామని, జోనల్ ప్లానింగ్‌తో ఉపాధి కేంద్రాల అభివృద్ధి తదితర అంశాలను మిషన్ రాయలసీమ ద్వారా అభివృద్ధి చేస్తారని అన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరాజు, మాజీ సర్పంచులు, గడిగోట సుబ్బరాయుడు, ముక్కర శంకరయ్యనాయుడు, కొమ్మ శివ, మధు సూదన్, దుద్యాల జైచంద్ర, అనితదీప్తి, హస్తి చంద్రరాజు, చిన్న, పాల్గొన్నారు.

ఘనంగా కొండంపల్లి మాతమ్మ జాతర

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని గ్రామ పంచాయతీలోని కొండపల్లి మాతమ్మ జాతరను ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. జాత రలో మహాజన సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి తాళ్లపాక సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతమ్మ ఆశీస్సులు గ్రామంలో ఎల్లవేళలా ఉండాలని, యువత ఉపాధి,ఉద్యోగ అవకాశాలు మెరుగుపడాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షులుగా వెంకట్రామయ్య

ప్రజాశక్తి-పీలేరు

ఏపి గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులుగా పీలేరుకు చెందిన ధనాసి వెంకటరామయ్య ఎన్నికయ్యారు. ఇటీవల బాపట్లలో జరిగిన 4వ మహాసభ సందర్భంగా నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా డి. వెంకట్రామయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నూర్ మొహమ్మద్, కోశాధికారిగా కొమ్మినేని శ్రీనివాసరావు, 15 మంది ఆఫీస్ బేరర్లతో కలిపి మొత్తం 41 మందితో నూతన రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా ఆదివారం పీలేరులో వెంకటరామయ్య మాట్లాడుతూ హై కోర్టు తీర్పు మేరకు గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ కోర్టు ఉత్తర్వులు డబ్ల్యూ.పి నెంబర్ 8828/2015 అమలు కోరుతూ జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలను సమర్పిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గ్రామపంచాయతీలలో సుమారు 1600 మంది కార్మికులు ఎలాంటి చట్టపరమైన సౌకర్యాలు పొందలేక పోతున్నారన్నారు. దశాబ్దాల తరబడి కార్మికులు వెట్టిచాకిరి చేస్తున్నారని అన్నారు. వారు కనీసం కనీస వేతనాలు, గుర్తింపు కార్డులు, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలకు కూడా నోచుకోలేక పోతున్నారని, 2015లో టెండర్ల విషయమై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను బుట్ట దాఖలు చేస్తున్నారని, కార్మికులు పోరాడి సాధించుకున్న జీఓ 57, 132 సైతం అమలుకు నోచుకోవడం లేదని, 2015కు ముందు పని చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు టెండర్లతో పనిలేకుండా మాస్ట్రోల్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. 2015కు ముందు నుంచి గ్రామ పంచాయితీల్లో పనిచేస్తున్న కార్మికులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతామన్నారు.

రైతుకు పాము కాటు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

వ్యవసాయ పొలంలో బోరుబావి వద్ద పనిచేస్తున్న రైతు పాము కాటుకు గురైన సంఘటన ఆదివారం మండలంలో జరిగింది. బాధితుని కుటుంబీకుల వివరాల మేరకు.. ములకలచెరువు మండలం, చౌడ సముద్రం పంచాయతీ చుంచువారిపల్లి చెందిన కృష్ణప్ప బోరుబావి వద్ద బోర్ మోటార్ వదిలి గేట్‌వాల్ తిప్పేందుకు వెళ్తుండగా గడ్డిలో ఉన్న పింజరిపాము ఎడమ కాలు పాదంపై కాటు వేసింది. కుటుంబీకుల బాధితు డిని ఆటోలో వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ తేజశ్రీ ప్రథమ చికిత్సలు చేసి మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. 108 వాహనంలో ఇఎంపి అనురాధ, పైలట్ ఓబులేరెడ్డిలు బాధితున్ని హుటాహుటిన మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని నూనెవారిపల్లెలోని తోట రామయ్య క్లినిక్‌లో ఆదివారం తిరుపతిలోని రేడియంట్ ఆస్పత్రి వైద్య సిబ్బందిచే నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యశిబిరంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఉచితంగా పరీక్షలు చేయించు కొని వైద్య చికిత్స పొందారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, కడుపునొప్పి, కిడ్నీ సమస్యలు, తలనొప్పి, నరాల బలహీనత, మోకాళ్ళ నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు, విష జ్వరాలు, మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి అనేక రుగ్మతలకు చికిత్స అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేడియంట్ ఆస్పత్రి పల్మనాలజీ, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్య సిబ్బంది, వైద్యులు తోటరామయ్య పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

జయప్రదదేవి సన్మాన కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్

అంగన్వాడీ కార్యకర్తకు సన్మానం

ప్రజాశక్తి-కలకడ

విరమణ ప్రతి ఉద్యోగికి సర్వసాధారణమేనని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కలకడలో అంగ న్వాడీ కార్యకర్త జయప్రదదేవి పదవీ విరమణ కార్యక్రమంలో ఎంపిపి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆమెను దుశ్శాలుతో అంగన్వాడీ కార్యర్తను సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జయప్రదదేవి ముప్పై ఏళ్ల అంగన్వాడీ కేంద్రంలో సేవలు అందించారని, ఆమె సేలు మరువలేనివని కొనియాడారు. మిగిలిన జీవితం సంతోషంగా పిల్లలతో గడపాలని ఆకాంక్షించారు. కార్య క్రమంలో వాణి, సూపర్వైజర్ యశోద, కమలాకర్‌రెడ్డి, జయ ప్రదదేవి భర్త లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా తిలక్, ఆజాద్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం బాలగంగాధర్ తిలక్, విప్లవవీరుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తరిగొండ రోడ్డులోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో తిలక్, ఆజాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెవివి అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం నా జన్మహక్కు అని చాటిన స్వాతంత్ర్య సమరయోధుడు బాలగం గాధర్‌తిలక్ అని, బ్రిటిష్ వారి చేతుల్లో మరణించకూడదని తనను తానే తుపాకీతో కాల్చుకున్న గొప్ప దేశభక్తుడు చంద్రశేఖర్ ఆజాద్ అని వారి సేవ లను, గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మంజుల, ఉపాధ్యాయులు జిలాని భాషా, సురేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

ప్రజాశక్తి-దువ్వూరు

మండలంలోని గుడిపాడులో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైందని ఎస్ఎల్ఆర్ హాస్పిటల్ డాక్టర్ మూలే రామ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శిబిరాన్ని మైదుకూరు బద్వేలు రోడ్డుకు చెందిన ఎస్ఎల్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. 300 మందికి షుగర్, బిపి, ఈసిజి, సిబిపి, ఎఇసి అవసరమైన వారికి లిపిడ్, ప్రొఫైల్ హెచ్‌బి ఎ1సి ఒక్కొక్కరికి రూ.1500 విలువైన పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన మందులు ఇచ్చామన్నారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని, యోగా చేయాలని డాక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఇసిజి టెక్నీషియన్ పివి రమణారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ రాజేంద్ర, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కేశప్ప

హత్య కేసులో నిందితుడి అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పిటిఎం మండలం నవాబుకోట గ్రామంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి కె. కేశప్ప తెలిపారు. ఆదివారం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిటిఎం మండలం, నవాబుకోటకు చెందిన శివరామిరెడ్డి కుమారుడు మధుకర్‌రెడ్డి(30) ఈనెల 16న అర్ధరాత్రి తన సొంత వ్యవసాయ పొలంలో గుడిసెలో నిద్రిస్తుండగా ఎవరో గుర్తు తెలి యని వ్యక్తులు తన కుమారుడిని గొంతు కోసి చంపారని మృతుడు తండ్రి శివ రామిరెడ్డి ఫిర్యాదు మేరకు ఈనెల 17వ తేదీన పిటిఎం పోలీస్ స్టేషన్‌లో హత్య కేసుగా నమోదు చేసినట్లు తెలిపారు. మొలకలచెరువు సిఐ సాదిక్‌అలీ, ఎస్ఐ రవీంద్ర, సిబ్బంది, టెక్నికల్ బృందం గత వారం రోజుల నుంచి సుమారు 25 మందిని విచారించినట్లు తెలిపారు. కేసును రీ-కన్స్ట్రక్షన్ చేసుకుంటూ ధర్యాప్తు చేశామన్నారు. అదే గ్రామానికి చెందిన సిపి.రెడ్డప్పరెడ్డి అలియాస్ రెడ్డప్ప మధుకర్‌రెడ్డిని కత్తితో గొంతు కోసి హత్య చేశాడని పేర్కొన్నారు. నింది తుడు సిపి.రెడ్డప్పరెడ్డికి గ్రామంలో సుబ్బమ్మ అనే మహిళతో సుమారు 13 సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్నాడని తెలిపారు. కొంత కాలంగా మృతుడు మధుకర్‌రెడ్డి కూడా సుబ్బమ్మతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడనే అక్కసుతో అదే గ్రామానికి చెందిన అంజిరెడ్డి అనే వ్యక్తి సహాయంతో హత్యయత్నానికి ప్రయత్నించి విఫలమయ్యాడని అన్నారు. తరువాత 16వ తేదీన మధుకర్‌రెడ్డి తన సొంత పొలంలో ట్రాక్టర్ నడిపి మద్యం సేవించి నిద్రిస్తుండగా పతకం ప్రకారం రెడ్డప్పరెడ్డి మధుకర్‌రెడ్డిని గొంతు కోసి హత్య చేశాడని తెలిపారు. వివాహేతర సంబంధమే హత్యకు ప్రధాన కారణమని స్పష్టం చేశారు. నిందితుడి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని కూడా స్వాధీనం చేసుకున్నామని, సాంకేతికపరమైన ఆధారాలు, ఖచ్చితమైన సమా చారంతోనే నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నామని తెలిపారు. మండలంలో సంచలనాత్మకమైన హత్య కేసును ఛేదించిన సిఐ సాదిక్ అలీ, పిటిఎం ఎస్ఐ రవీంద్రను, టెక్నికల్ టీంను డిఎస్‌పి అభినందించారు. రివార్డు కోసం ఎస్‌పికి సిఫారసు పంపిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ములకలచెరువు

గుర్తుతెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గత నెల 28న మండలంలో చోటు చేసుకుంది. ములకలచెరువు మండలం, వేపూరికోట పంచాయతీ, పెద్దయ్యగారిపల్లికి చెందిన రైతు ఆనంరెడ్డి(40) ఇంటికి వెళ్తుండగా ట్రాక్టర్ బీగాలు చేజారిపోయాయి. సెల్‌ఫోన్ టార్చ్‌న్ వేసుకొని వేపూరికోటలో రహదారిపై బీగాలు వేతుకుతుండగా కదిరి వైపు నుంచి మదనపల్లె వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీ కొన్న సంఘటన విధితమే. ఈ ప్రమాదంలో రైతు ఆనంరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన ఆయన మదనపల్లె, తిరుపతి ఆస్పత్రులలో చికిత్సలు పొందాడు. శనివారం బెంగళూరులో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మూడు లారీలు ఢీ : డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లి సమీపంలో ఉన్న వంతెన వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడు లారీలు ఢీకొని లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానిక ఎస్ఐ కొండారెడ్డి తెలిపిన వివరాల మేరకు..కడప వైపు నుంచి సిమెంట్ లోడుతో వెళ్తున్న మూడు లారీలు రామాపురం మండలం పాలన్నగారిపల్లి సమీపంలోని వంతెన వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీ నెమ్మదిగా వెళుతుండటంతో వెనకవైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయి నట్లు తెలిపారు. వెనుక వస్తున్న మూడువ లారీ ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టిందన్యానరు. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీలను పక్కకు తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 24 జులై 2023

5

వైఎస్ఆర్

మారణకాండ మానవత్వానికి మాయని మచ్చ

బద్వేలు : మణిపూర్ మారణకాండ మానవత్వానికి మాయని మచ్చ అని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ పేర్కొన్నారు. మణిపూర్లో కుకి తెగపై జరుగుతున్న మారణహోమాన్ని, అమానుషత్వాన్ని నిరసిస్తూ ఆదివారం సాయంత్రం స్థానిక ఎన్జీవో హోమ్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈశాన్య రాష్ట్రం మణిపూర్లో మహిళలపై జరుగుతున్న మారణకాండను యుటిఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఉమ్మడి పౌరస్మృతి, మణి పూర్ అల్లర్ల ద్వారా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోని ప్రజల మధ్య మత విద్వేషాలు సృష్టించేందుకు, తద్వారా రాబోయే ఎన్నికలలో లబ్ధి పొం దేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. అల్లర్లను పరిష్కరించాల్సిన మణిపూర్ ముఖ్య మంత్రి బీరేన్సింగ్ అల్లర్లను ప్రోత్సహించడం దారుణమని వాపోయారు. మైతై యి, కుకి జాతుల మధ్య జరుగుతున్న అల్లర్లను మతాల మధ్య అల్లర్లుగా సృష్టించి, మహిళలను నగ్నంగా ఊరేగించడం, మానభంగం చేయడం, హత్య చేయడం మానవత్వానికి మాయని మచ్చగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజలను విభజించడానికే 'యుసిసి'

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజలను విభజించడానికే యుసిసి ప్రస్తావనను బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు తీసుకొచ్చిందని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం పాతబస్టాండ్ సిపిఎం కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ అధ్యక్షతన 'యుసిసిని వ్యతిరేకించండి-దేశాన్ని రక్షించండి' అనే అంశంపై రౌండ్టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయా పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ భారతదేశంలోని హిందూ, ముస్లిం, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, పారశీకుల అందరికీ ప్రత్యేక పర్సన్ లాలు భారత రాజ్యాంగం కల్పించిందని చెప్పారు. 2018 జాతీయ లా కమిషన్ ఈ చట్టాలు రాజ్యాంగ రక్షణ ఉందని ప్రకటించిందన్నారు. తమిళనాడులో 1967లో ప్రత్యేక హిందూ మ్యారేజ్ యాక్ట్ వచ్చిందని చెప్పారు. నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మట్టిలో కలిపి ఆర్ఎస్ఎస్ హిందుత్వ అజెండాను అమలు చేసేందుకు కుట్ర పన్నుతోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక హక్కుల చట్టం రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక హక్కులు ఇచ్చిన 35-ఎ రాజ్యాంగ హక్కులను రద్దు చేయడం వంటి దుశ్చర్యకు పాల్పడిందని వాపోయారు. ఐదేళ్లుగా జమ్మూ కాశ్మీర్లో రాష్ట్రపతి పరిపాలన సాగుతోందని, ఈశాన్య రాష్ట్రాల్లో మారణ హోమం జరుగుతోందని తెలిపారు. ఇది బిజెపి అశాస్త్రీయ నిర్ణయాల అమలులో భాగంగా వచ్చినవేనని, దీనికి ప్రధాని మోడీ బాధ్యత వహించాలని చెప్పారు. దేశంలో 'కామన్ క్రిమినల్ కోడ్' ఐపిసి, సిఆర్పిసి, ఎవిడెన్స్ యాక్ట్ ఉన్నాయని, ఇప్పుడు ప్రత్యేకంగా 'యూనిఫామ్ సివిల్ కోడ్' అవసరం లేదని వివరించారు. అధికారంలోకి వచ్చిన ఏ పార్టీ ప్రభుత్వమైనా రాజ్యాంగానికి లోబడి పని చేయాలని, కానీ బిజెపి రాజ్యాంగాన్ని పక్కనపెట్టి సొంత హిందుత్వ అజెండాను అమలు చేస్తోందని విమర్శించారు. ఇది రాజ్యాంగంలోని లౌకికవాదం, ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, సోషలిజం లక్ష్యాలకు భిన్నంగా ఆశాస్త్రీయంగా ముందుకు పోతుందని చెప్పారు. బిజెపి అతివాదచ హిందుత్వ దుందుడుకు విధానాలను దేశ ప్రజలందరూ ఐక్యంగా ఎదుర్కోవాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో ముస్లిం మైనార్టీ

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్

వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాబుబాయ్, సంఘ సేవకులు సల్లావుద్దీన్, మైనార్టీ హక్కుల నాయకులు దస్తగిరి, తెలుగుదేశం పార్టీ కడప నియోజకవర్గం నాయకులు అమీర్ బాబు, లక్ష్మిరెడ్డి, నసీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.ఎ.సత్తార్, చార్లెస్, సిపిఐ నాయకులు సావంత్ సుధాకర్, సుబ్రహ్మణ్యం, భాగ్యమ్మ, బిఎస్పి జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, లోక్సత్తా నాయకులు కృష్ణ, సిపిఐ(ఎంఎల్) నాయకులు రమణయ్య, సిపిఎం కడప నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బిఎస్ సుబ్బన్న, బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్, కె. శ్రీనివాసుల రెడ్డి, పట్టణ కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, న్యాయవాది అమీన్ ప్రసంగించారు.

చంద్రబాబు, వై.ఎస్. జగన్, పవన్ తమ వైఖరి బహిరంగపరచాలి

కడప : యుసిసి పై చంద్రబాబు, జగన్, పవన్ కళ్యాణ్ తమ వైఖరి బహిరంగపరచాలని ఎపిసిసిసభ్యులు బండి జకరయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా పార్టీ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలలో యుసిసి(యూనిఫాం కామన్ సివిల్ కోడ్) బిల్లును బిజెపి ప్రభుత్వం ప్రవేశపెడుతోంది, భిన్న జాతులు, భిన్న సంస్కృతులు, భిన్న మతాలు, విభిన్నమైన ఆచార వ్యవహారాలు ఉన్న ఈ దేశంలో యు సి సి చట్టం అమలులోకి తేవడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉందన్నారు.

మద్యంతో జేబులు నింపుకుంటున్న జగన్

- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధరేశ్వరి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

మద్యపానాన్ని నిషేధిస్తామని మాయమాటలతో అధికారంలో కొచ్చిన ముఖ్యమంత్రి జగన్ అదే మద్యపానాన్ని విచ్చలవిడిగా అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరి విమర్శించారు. ఆదివారం స్థానిక రాయల్కౌంటీలో ఏర్పాటు చేసిన రాయలసీమ జోన్ పదాదికారుల సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి మద్యపాన బాధిత కుటుంబాలు ఏమైనా పర్వాలేదు అని వ్యవహరించడం సిగ్గుచేటన్నారు .అక్రమంగా మైనింగ్ యజమానులపై కేసులు పెట్టి తనకు అనుకూలంగా మలచుకుంటున్నారని ఆరోపించారు. 14,15వ ఆర్థికసంఘం నిధులను నేరుగా సర్పంచుల ఖాతాలలోకి జమచేసినప్పటికీ జగన్ ప్రభుత్వం దారిమల్లించడంతో రాష్ట్రంలో మహిళా సర్పంచ్తో సహ ముగ్గురు సర్పంచులు ప్రకాశం జిల్లాలో ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిపారుదల రంగం కునారిల్లిపోయిందన్నారు. కనీసం మరమ్మతులు చేసుకోలేని స్థితిలో జగన్ ప్రభుత్వం ఉందని, ఇందుకు అన్నమయ్య ప్రాజెక్ట్ ఉదాహరణ అన్నారు. జగన్ హయాంలో ఒక్క పరిశ్రమ రాకపోవడంతో యువత వలసలు పోతున్నారని తెలిపారు. తన సొంత జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోలేని స్థితిలో జగన్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ వివేకా హత్యకేసు, కోడికత్తి కేసులో ప్రజల్ని మభ్యపెట్టి అదికారంలో కొచ్చిన జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

నేతన్నలకు కుచ్చు టోపీ

ప్రజాశక్తి - కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

సబ్సిడీలు, స్వయం ఉపాధి, ప్రోత్సాహకాలు రద్దు చేసి బటన్ నొక్కి మీ బతుకులు మార్చేస్తున్నా అనడం సిగ్గుచేటని, నేతన్నలపై జగన్ రెడ్డి నీతిలేని రాజకీయం చేస్తున్నారని మాసా కోదండ రామ్ విమర్శించారు. ఆదివారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్రెడ్డి ప్రభుత్వం వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయినా నేతన్న నేస్తంకింద అయిదో విడత డబ్బులేస్తున్నానని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వెంకటగిరిలో జరిగిన బహిరంగ సభలో పట్టపగలే ప్రజల సమక్షంలో పచ్చి అబద్ధాలాడుతున్నారని ఎద్దేవాచేశారు. నేతన్న నేస్తం పథకం కింద గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 81 వేల మందిని అర్హులుగా పేర్కొని, ఇప్పుడు 80 వేల మంది మాత్రమే అర్హులు అనడంలో మతలబు ఏంటి అన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సాధికార సమితి రాజంపేట పార్లమెంటు కన్వీనర్ ఆలూరు వెంకట సుబ్బయ్య, కడప పార్లమెంట్ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి గుర్రం నటరాజా, మామిళ్ల కృష్ణమూర్తి, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో మోడీ సర్కార్ విఫలం : డివైఎఫ్ఐ

బద్వేలు : నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో మోడీ సర్కార్ పూర్తిగా విఫలమైందని డివైఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం బద్వేల్ పట్టణంలో స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం డివైఎఫ్ఐ బద్వేలు పట్టణ మహిళా కన్వీనర్ సి. గురుదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నిరుద్యోగ యువతీ యువకులకు తాము అధికారంలోకి వస్తే ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని, వంద రోజుల్లో నల్లధనం వెలికి తీస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా నిరుద్యోగ యువతీ యువకులకు అనేక హామీలనుసైతం తుంగలో తొక్కారని వాపోయారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతీ యువకులకు ఇచ్చినటువంటి హామీలు అమలు చేయాలని వారు తెలిపారు లేనిపక్షంలో యువతీ యువకులు పెద్ద ఎత్తున పోరాడాలని ఆయన తెలిపారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె. నాగేంద్రబాబు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, మహిళా కో కన్వీనర్ నాగేశ్వరి, డివైఎఫ్ఐ నాయ కులు గంగనపల్లి నాగార్జున, ఎస్కె మస్తాన్ షరీఫ్, పి. సురేంద్ర, టీ. సురేష్ ,పి. రాజేష్, లక్ష్మీనారాయణ శ్రీనివాసులు, యు. ఆంజనేయులు, యు. గురయ్యా, జి. సురేష్ , నేలటూరి బ్రహ్మయ్య, ఇమ్మానేలు తదితర డివైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

సభా నిర్వహణ సామ్రాట్ జింకా సుబ్రహ్మణ్యం

కడప అర్బన్ : వందలాది సాహిత్యకార్యక్రమాలను నిర్వహించిన జింకా సుబ్రహ్మణ్యం సభా నిర్వహణా సామ్రాట్ అని ఉపాధ్యాయులు కొత్తపల్లి శ్రీను కొనియాడారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్శాస్త్రి సమావేశ మందిరంలో 122వ సదస్సు నిర్వహించారు. 'జింకా సుబ్రహ్మణ్యం జీవితం, సాహిత్యం' అనే అంశంపై ఉపాధ్యాయులు కొత్తపల్లి శ్రీను ప్రసంగించారు. జింకా యువరచయితల సంఘం (హైదరాబాదు), కడప జిల్లా రచయితల సంఘం, సాహిత్య కళాభారతి, కళాభారతి కార్యదర్శిగా, పుట్టపర్తి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శిగా వందల సంఖ్యలో సాహిత్య సభలు నిర్వహించారన్నారు

ఫుట్బాల్ జట్ల ఎంపికలకు విశేష స్పందన

ప్రజాశక్తి - కడప

జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

జిల్లా స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో ఆదివారం జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్ జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలకు విశేష స్పందన లభించింది. బాలికలు 40 మంది, బాలురు 80 మంది ఎంపికల్లో పాల్గొనడం విశేషం. ఎంపికలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుట్బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు మైఖేల్ డేనియల్ ప్రదీప్ కుమార్, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి మామిడి సుధీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మైఖేల్ డేనియల్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. జిల్లా సాయి జట్టుకు ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి పోటీలలో మంచిగా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎంపికలకు 9 క్లబ్ల నుండి 120 మంది హాజరయ్యారని చెప్పారు. కార్యక్రమాలలో ప్రెసిడెంట్ కె థామస్ జీవన్ బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ అనిల్, సభ్యులు డేనియల్ , మైఖేల్, కోచెస్ హరి, సునీల్, దేవ, సీనియర్ క్రీడాకారులు సుబ్బయ్య, గంగులయ్య పాల్గొన్నారు.

పెండింగ్ డిఎలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న గంగరాజు

పెండింగ్లో ఉన్న మూడు డిఎలు వెంటనే మంజూరు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేండ్రగుత్తి గంగరాజు కోరారు. ఆదివారం సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డిఎ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అయితే బకాయిలు వాయిదాల పద్ధతిలో కాకుండా ఒకేసారి వెంటనే విడుదల చేయాలని కోరారు. మూడు డిఎలు పెండింగ్లో ఉన్నాయని, వాటిని కూడా మంజూరు చేయాలని కోరారు. పిఆర్సి బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని, ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన అమలు చేయడం ఆలస్యం అవుతుంది కనుక వెంటనే ఐఆర్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని పెండింగ్ డిఎలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సి. సుదర్శన్ బాబు, కార్యదర్శులు కట్టా గంగాధర్, జయరాముడు, మంజుల, రాజబాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పి. శేషగిరిరావు పాల్గొన్నారు.

మానవ హక్కులను కాపాడటమే ధ్యేయం

ప్రజాశక్తి - కడప

సిద్ధయ్యకు నియామక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

మానవ హక్కులను కాపాడటమే తమ ధ్యేయం అని కాంగ్రెస్ పార్టీ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు బాలగిరి శివ అన్నారు.ఆదివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎపిపిసిసి హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు మన్యం రాజశేఖర్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు నేతృత్వంలో చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట గ్రామ నివాసి రూపనుగుడి సిద్దయ్యను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. సిద్దయ్యకు నియామక పత్రాన్ని పాలగిరి శివ, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై విష్ణు ప్రీతం రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని అందుకున్న సిద్దయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. విష్ణు ప్రీతం రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం రాష్ట్రంలో కడప జిల్లాలో మానవ హక్కులను భంగం కలిగిస్తూ పరిపాలన కొనసాగిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్యుఐ అధ్యక్షులు బాబు పాల్గొన్నారు.

నేరస్తులను కఠినంగా శిక్షించాలి

కడప అర్బన్ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మణిపూర్ ఘటన నేరస్తులను కఠినంగా శిక్షించాలని ఖురేషి సంక్షేమ (కటిక) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.ఆరిపుల్లా కోరారు. ఆదివారం మంగళగిరి కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్లో మూడునెలలుగా దాచిపెట్టిన హింస ఒక్కసారిగా బట్టబయలయిందని చెప్పారు. మే 3న అక్కడ అల్లర్లను మొదలు పెడితే దానిని మూడు నెలలపాటు ప్రపంచానికి తెలియకుండా దాచటంలో బిజెపి నాయకత్వం చాలా సఫలీకృతం అయ్యిందని పేర్కొన్నారు. దుష్పరిణామం మణిపూర్ లేదా ఈశాన్య ప్రాంతానికి మాత్రమే పరిమితం కాదని, యావత్ దేశంపై ప్రభావాన్ని కలిగిస్తుందన్నారు. సమావేశంలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఖాదర్ బాషా, అనంతపురం జిల్లా అధ్యక్షుడు మగ్దుమ్,మంగళగిరి నగర అధ్యక్షుడు హైదర్ అలీ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్రమ్, సిరాజ్,మహ్మద్ హుసేన్,అబ్దుల్ లతీఫ్, షేక్ సాబ్ పాల్గొన్నారు.

మందుల నాణ్యతకు పెద్దపీట

నిబంధనల్ని ఉల్లంఘిస్తే జరిమానాలు

మందుల దుకాణాలకు లైసెన్స్లు తప్పనిసరి

డ్రగ్స్ అండ్ కంట్రోల్ ఎడి ఎ.కిరణ్కుమార్ వెల్లడి

ప్రజాశక్తి - కడపప్రతినిధి

ముఖా ముఖి..

మందుల్లో నాణ్యతా ప్రమాణాలను తనిఖీల ద్వారా ప్రజారోగ్యానికి పాటుపడుతున్నాం. జాతీయ డ్రగ్స్ అండ్ కంట్రోల్ పాలసీ ప్రకారం దుకాణదారులు, కంపెనీల నిర్వాహకులు నిబంధనల్ని తు.చ తప్పకుండా పాటించాలి. ప్రజారోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో నిరంతర తనిఖీలు చేపపట్టడం అత్యవసరం. మందుల దుకాణాల నిర్వహణకు లైసెన్స్లు తప్పనిసరిగా కలిగి ఉండాలి. డ్రగ్స్ అండ్ కంట్రోల్ పాలసీ మేరకు నిబంధనలు పాటించని దుకాణదారులకు భారీ జరిమానాలు విధిస్తాం. ప్రజానీకం యాంటీబయా టిక్స్, స్టెరాయిడ్స్ను వైద్యుల సిఫారసు ద్వారా మాత్రమే వాడుకోవాలి. లేనిపక్షంలో ప్రజారోగ్యం క్షీణించే ప్రమాదం ఉందని పేర్కొంటున్న డ్రగ్స్ అండ్ కంట్రోల్ ఎడి నాగకిరణ్కుమార్తో ప్రజాశక్తి ముఖాముఖి..

డ్రగ్స్ అండ్ కంట్రోల్ పని విధానాల గురించి తెలపండి?

జిల్లాలోని మందుల దుకాణాలను నిరంతరం తనిఖీలు చేయడం, బ్లడ్బ్యాంకులు, ఆక్సిజన్ యూనిట్స్, బల్క్ డ్రగ్ ఫార్ములేషన్ కేంద్రాలను పర్యవేక్షించడం, మందుల దుకాణదారులు మందులను అధిక ధరలకు విక్రయించకుండా చూడడం, నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేయడం వంటి అంశాలను నిరంతరం పరిశీలిస్తూ ఉండాలి.

మందుల దుకాణాల వివరాలు తెలపండి?

విభజిత వైఎస్ఆర్ కడప జిల్లాలోని 36 మండలాల్లో1200 మందుల దుకాణాలున్నాయి. ఇందులో హోల్సేల్ 800, రిటైల్ దుకాణాలు 900 ఉన్నాయి. రోజూ ర్యాండమ్గా మందుల తనిఖీలు చేయడం, ఏడాదికి రెండు దఫాలుగా మందుల కంపెనీలను తనిఖీలు చేయడం ద్వారా నాణ్యమైన మందులను అందుబాటులో ఉంచడానికి కసరత్తు చేస్తున్నాం.

డ్రగ్స్ కంపెనీల కార్యకలాపాల గురించి వివరించండి?

జిల్లాలో ఎనిమిది బ్లడ్బ్యాంకులున్నాయి. ప్రొద్దుటూరులో రెండు, కడపలో ఐదు, పులివెందుల ఒకటి, స్వచ్ఛంధ సంస్థల ఆధ్వ ర్యంలో కడపలోని ఐఆర్సిఎస్, ప్రొద్దుటూరు ఒకటి, కడపలో రెండు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని మూడింట్లో కడప, ప్రొద్దుటూరు, పులివెందుల ప్రాంతాల్లో ఒకొక్కటి చొప్పున ఉన్నాయి. వీటితోపాటు టెక్నికల్ డివైస్ విభాగాలు మూడు, కొప్పర్తిలో ఆక్సిజన్ యూనిట్స్, కడపలో బల్క్ డ్రగ్స్ ఫార్ములేషన్ యూనిట్స్ కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

స్టాఫ్ కొరత గురించి చెప్పండి?

స్టాఫ్ కొరత ఉన్న మాట వాస్తవమే. వైఎస్ఆర్ కడప జిల్లాలో ఇద్దరు ఇన్స్పెక్టర్లు ఉండాలి. కానీ ఒక్కరే ఉండడంతో సమస్య ఎదురవుతోంది. కడప జిల్లా కేంద్రంలో ఒకరు, జమ్మలమడుగు కేంద్రంగా ఒకరు ఉండాలి. ఇందులో జమ్మలమడుగు డివిజన్లో అన్నమయ్య జిల్లాకు సంబంధించి ఇన్స్పెక్టర్ ఇన్ఛార్జిగా బాధ్యతలు చూస్తున్నారు.

కేసుల వివరాల గురించి తెలపండి?

జిల్లాలో సుమారు 30 కేసులు నమోదు చేయడమైంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఒకటి మాత్రమే నమోదైంది. కోర్టు ట్రయ ల్స్లో ఉన్నాయి. వారంలో మూడు రోజుల వరకు కోర్టు కేసులకు సమయాన్ని వెచ్చించాల్సి వస్తోంది.

కేసుల నమోదుకు ప్రాతిపదికలు, పారామీటర్లు ఏమిటి?

జిల్లాలో మందుల దుకాణాదారులు దగ్గర నుంచి మందుల కంపెనీల వరకు క్వాలిటీని పాటించాలి. అధిక ధరలకు మందులు విక్రయించరాదు, లైసెన్స్లు లేకుండా మందుల క్రయ,విక్రయ కార్య కలాపాలు విక్రయించడం వంటి అంశాలపై కేసులు నమోదు చేస్తాం

బడుగుల అభ్యున్నతికే 'లయన్స్' సేవలు

ప్రజాశక్తి కడప అర్బన్

పోతుల వెంకట్రామిరెడ్డిని అభినందిస్తున్న సభ్యులు

జిల్లాలోని బడుగు, బలహీనవర్గాల అభ్యుదయం కోసమే లయన్స్ క్లబ్ ఏర్పాటైందని తన కార్యవర్గం ప్రకటించింది. లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఆదివారం స్థానిక మానస ఇన్ హోటల్లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి. ఖాసిం ఖాన్ మాట్లాడుతూ ప్రజల్లో సేవాభావాన్ని పెంచేందుకే క్లబ్ ఏర్పాటైందన్నారు. సంస్థ నిర్వహణకు తన వంతు సహాయ సహకారాలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని చెప్పారు. లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కె. చిన్నప రెడ్డి ప్రధాన ప్రసంగం చేస్తూ ప్రజలకు ప్రభుత్వం ఎంతో సహాయం చేస్తోందని, తమ వంతుగా మానవత్వాన్ని చాటుకొంటూ క్లబ్బు కొత్త కమిటి మరిన్ని సేవలు అందించనుందని వివరించారు. లయన్స్ పాస్ట్ గవర్నర్లు సిహెచ్. రమేష్నాథ రెడ్డి నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం, ప్రతిజ్ఞ చేయించగా, లయన్ డాక్టర్ ఎం. సుధాకర రెడ్డి నూతన సభ్యులను సభకు పరిచయం చేశారు. లయన్స్ ప్రముఖులు కె. కృష్ణమూర్తి, షేక్ అబ్దుల్లా, జి. గుల్జార్ బాషా, పి.ఎస్. హరినాథ రెడ్డి, పి.వి. రమేష్లతో పాటు అన్ని క్లబ్బుల అధ్యక్షులు ప్రత్యేక అతిథులుగా హాజరై ప్రసంగించారు. అధ్యక్షులు డాక్టర్ ఆర్. రంగనాథ రెడ్డి, కార్యదర్శి వి. గౌరీ శంకర్, లయన్ గునిశెట్టి శ్రీనివాసుల పర్యవేక్షణలో నూతన కమిటీ అధ్యక్షునిగా పోతుల వెంకట్రామి రెడ్డి, ఉపాధ్యక్షులుగా వలికల గౌరీ శంకర్, కారపురెడ్డి చంద్ర ఓబుల్ రెడ్డి, కార్యదర్శిగా కొండూరు జనార్దన రాజు, సహ కార్యదర్శిగా బోగాల కొండా రెడ్డి, కోశాధికారిగా దేవతి రవీంద్రనాథ్, సహ కోశాధికారిగా ముకేష్ కుమార్లను ఏకగ్రీవంగా ఎన్నుకొ న్నారు. అనంతరం వివిధ విభాగాల చైర్మన్లుగా తొమ్మిది మంది వైద్యులను, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను, 16 మందిని బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా ఎన్నుకొన్నారు.

కంప చెట్లు తొలగింపు

పోరుమామిళ్ల టౌన్ : మండలంలోని మైదుకూరు రోడ్డు నుంచి మద్ధి మానుస్వామి ఆలయానికి వెళ్లే దారిలో రోడ్డు ఇరువైపులా కంపచెట్లు దట్టంగా పెరిగి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గుతుండడంతో ఆదివారం తెలుగుదేశం పార్టీ బద్వేల్ నియోజకవర్గం చెరుకూరి రవికుమార్ తన సొంత నిధులతో రెండు జెసిబిలను పెట్టించి కంప చెట్లను తొలగించారు. రహదారిని శుభ్రం చేయించే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఆదివారం మూ భక్తులు ఆలయానికి వస్తుంటారని, వారికి అసౌకర్యం కలిగకుండా కంపచెట్లు తొలగించామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో చెరుకూరి శేఖర్ ,మల్లికార్జున రెడ్డి, సత్యం, పురం బాలకృష్ణ,కూల్ డ్రింక్స్ సుబ్బయ్య పాల్గొన్నారు.

128 పరుగులకే కుప్పకూలిన కర్నూలు

కడప : కడప బౌలర్లు అస్లాం, సాయి అర్జిత్ రెడ్డి బౌలింగ్ దాటికి కర్నూలు జట్టు మొదటి నిమ్స్ లో 128 పరుగులకే ఆల్ అవుట్ అయింది. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ -19 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా ఆదివారం కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్ లో కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్కు దిగిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్లో 39.2 ఓవర్లలో 128 పరుగులకే ఆల్ అవుట్ అయింది. ఆ చెట్టులోని గణేష్ 34 పరుగులు చేశాడు. కడప జట్టులోని ఎస్ఎండి అస్లాం అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. **278 పరుగులు సాధించిన నెల్లూరు జట్టు**.. వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ప్రారంభమైన వేరొక మ్యాచ్లో అనంతపురం, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 65.2 ఓవర్లలో 278 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన అనంతపురం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 17.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 86 పరుగులు చేసింది. ఆ జట్టులోని అర్జున్ టెండూల్కర్ 57 (నాట్ అవుట్), వీర రెడ్డి 23 (నాట్ అవుట్) పరుగులు చేశారు.

సభ్య సమాజం సిగ్గుపడేలా ఘటన

ప్రజాశక్తి - కడప

మణిపూర్లో మహిళల పట్ల అసంఘీక శక్తులు చేసిన దుశ్చర్య సంఘటన యావత్ సభ్య సమాజం సిగ్గు పడేలా ఉందని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కడప నగరంలోని యూత్ కాంగ్రెస్ కార్యాలయంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడు వంశీ యాదవ్తో కలసి ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దేశంలో రోజురోజుకూ మహిళలకు రక్షణ కరువైందన్నారు. భేటీ బచావో బేటి పడావో ఎక్కడో ప్రధాని సమాధానం చెప్పాలన్నారు. నెల రోజులుగా మణిపూర్లో అల్లర్లు, ఇతర ఘటనలు చోటు చేసుకున్నా కేంద్ర ప్రభుత్వం పట్టీ పట్టనట్లు వ్యవహించడం దారుణమని వాపోయారు. రోమ్ నగరం తగలబడుతుంటే నిరో చక్రవర్తి ఫిడేలు వాయించిన మణిపూర్ తగలబడి పోతుంటే దేశ ప్రధాని మోడీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్షా మౌన నిద్రలో ఉండడం సిగ్గు చేటని పేర్కొన్నారు. జరుగుతున్న ఘటనలకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

26న విద్యుత్ ఉద్యోగ, కార్మికుల సదస్సు

కడప అర్బన్ : ఎపి జెన్ కో, ట్రాన్స్ కో, డిస్కామ్స్ లో పనిచేస్తున్న ఉద్యోగుల, కాంట్రాక్టు కార్మికుల సమస్య లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సు ను జయప్రదం చేయాలని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ చైర్మన్ పి. సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బిరెడ్డి, కన్వినర్ రామలింగా రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం విద్యుత్ కార్యాలయంలో రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల సమస్యలు యాజమాన్యం పరిష్కరించకుండా చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించే వాతావరణం కనబడలేదని మండిపడ్డారు. వేతన సవరణ గడువు ముగిసి పదిహేను మాసాలు దాటినా ఇప్పటివరకు కొత్త వేతన సవరణ ప్రకటించలేదన్నారు. ముఖ్య మంత్రి పాద యాత్రలో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ కాంట్రాక్టు కార్మికులందరికీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిస్కం నాయకులూ యన్. శివశంకర్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

కలసపాడు : మండలంలోని స్థానిక రోమన్ క్యాథలిక్ మిషన్లో ఆదివారం ప్రపంచ వృద్ధుల దినోత్సవ సందర్భంగా సుమారు 30 మంది వృద్ధులకు రేవడెంట్, ఫాదర్ కొత్తపల్లి, మనోహర్ ఆధ్వర్యంలో చీరలు, పంచలు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విచారణ గురువులు కొత్తపల్లి, మనోహర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పిల్లలు తమ తల్లిదండ్రులను అనాథాశ్రమాల్లో వదిలి పెట్టి విదేశాల్లో ఉన్నారని చెప్పారు. వృద్ధులకు ఆసరాగా ఉండాలనే ఉద్దేశంతో దుస్తులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అనంతరం మణిపూర్లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు, మారణ హోమాలకు స్వస్తి పలకాలని అంబేద్కర్ సర్కిల్ వద్దకు ర్యాలీని ప్రారంభించారు కార్యక్రమంలో విశ్రాంత ఎంఇఒ బాలసుందరం, గ్రామ పెద్దలు, సంఘ యువకులు, మహిళలు, పాల్గొన్నారు.

మోడీ, అమిత్షా రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న మహమ్మద్ అలీఖాన్

మణిపూర్ రాష్ట్రంలో మహిళల నగ్న ప్రదర్శన, సామూహిక అత్యాచారాలు, హత్యలు, దహనకాండతో భారతదేశ ప్రతిష్టను ప్రపంచం దృష్టిలో దిగజార్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోమంత్రి అమిత్షా తమ పదవులకు తక్షణం రాజీనామా చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్లు ఉపాధ్యక్షుడు మహమ్మద్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు .కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపుగా 80 రోజుల నుంచి మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసకాండ, గృహ దహనాలు, పిల్లలు, యువకులను లక్ష్యంగా చేసుకొని హత్యలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని వాపో యారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మణిపూర్లో కుకీ తేగా అంతానికి, క్రైస్తవుల విధ్వంసానికి పక్క ప్రణాళికను అమలు చేస్తుందని ఆరోపించారు. అక్కడి బిజెపి ప్రభుత్వ ముఖ్యమంత్రి బీరేన్సింగ్పై చట్టపరమైన చర్యలు తీసుకుని, ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ప్రధానిగా మోడీ పూర్తిగా విఫలం కాగా, తన వైఫల్యాన్ని దేశ ప్రజలపై రుద్దడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శన మన్నారు.

రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 12న గుంటూరులో నిర్వహించే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు అందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర కో చైర్మన్ లెక్కల జమాల్ రెడ్డి, ఉమ్మడి కడప జిల్లా చైర్మన్ మోపూరి శివారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఉమ్మడి కడప జిల్లా ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం జిల్లా చైర్మన్ శివారెడ్డి అధ్యక్షతన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లెక్కల జమాల్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ స్థాపించిన ఐదేళ్ల కాలంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో ముందంజలో ఉందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న 1998, 2008 డిఎస్సి వారికి పోస్టులను ఇప్పించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ మోపూరి శివారెడ్డి, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బోరెడ్డి వరదారెడ్డి, జిల్లా కో - చైర్మన్ వల్లెం సుబ్బారెడ్డి, వైఎస్ఆర్టిఎఫ్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు సజ్జల రమణారెడ్డి, ఎన్సిసి రాష్ట్ర అధ్యక్షులు పి .వి. సుబ్బారెడ్డి, జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ఏపీటీజి అసోసియేషన్ అధ్యక్షులు బాలసౌరి రెడ్డి, పిఆర్టియు రాష్ట్ర సిపిఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న లెక్కలజమాల్రెడ్డి

పాఠకుల సభ్యత్వాన్ని మరింత పెంచాలి

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక శాఖా గ్రంథాలయాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్.అమీరుద్దీన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. 292 సభ్యత్వాలు మాత్రమే ఉన్నాయని, పాఠకుల సంఖ్య మరింత పెంచాలని సూచించారు. వేసవి శిక్షణా తరగతులు క్రమం తప్పకుండా నిర్వహించినందుకు గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డిని అభినందించారు. రికార్డులు, పుస్తకాలు, పత్రికల నిర్వహణ బాగుందని ప్రశంసించారు. పాఠకులతో సభ్యత్వం చేయించాలన్నారు. విద్యార్థులు తరచూ గ్రంథాలయానికి వచ్చేలా చూడాలని ఆయన సూచించారు.

మాట్లాడుతున్న కార్యదర్శి ఎస్.అమీరుద్దీన్

ఘనంగా బీచువారిపల్లెలో పూజా కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని బీచువారిపల్లి గ్రామంలో సీతారాముల వారి గాలిగోపురం, కలశపూజా కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో ఏపీఐఐసీ రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపిపి బనగానపల్లె అబూబకర్ సిద్దిక్, వైసిపి నాయకులు పత్తి కృష్ణారెడ్డి, గంగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమంలో ఎంపిపి, నాయకులు

కడప పార్లమెంట్ కాపునాడు అధ్యక్షులుగా 'ఆకుల'

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప పార్లమెంట్ కాపునాడు అధ్యక్షులుగా మండలంలోని బొందలకుంట గ్రామానికి చెందిన ఆకుల రవికుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కాపునాడు కార్యవర్గం ఆదేశాసారం రాయలసీమ జోన్ అధ్యక్షులు గంగల వీరాంజనేయులు సలహా మేరకు జాతీయ అధ్యక్షులు గాళ్ళ సుబ్రహ్మణ్యం తనను కడప పార్లమెంటు అధ్యక్షులుగా నియమించినట్లు చెప్పారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల సమస్యలపై తన వంతు పోరాటం చేస్తానన్నారు. వారికి అన్ని విధాలా అండగా నిలిచి చేతనైన సహాయ సహకారాలు అందిస్తానన్నారు. త్వరలో కడప పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాలు పర్యటించి, బలిజ కుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో కడప పార్లమెంటు అధ్యక్షులు పదవి ఇచ్చినందుకు ఆంధ్రప్రదేశ్ కాపునాడు కార్యవర్గానికి, జాతీయ, రాయలసీమ అధ్యక్షులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన వెనుక ఉండి ప్రోత్సహిస్తున్న బలిజ కులస్తులందరికీ రవికుమార్ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.

ఆకుల రవికుమార్

మిషన్ రాయలసీమ సమన్వయకర్తగా నాగరాజు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఏర్పాటు చేసిన మిషన్ రాయలసీమ కడప జిల్లా సమన్వయకర్తగా రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజును నియమించారు. ఈ సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ లోకేష్ తన పాదయాత్రలో రాయలసీమ ప్రాంత వాసుల కష్టాలను తెలుసుకున్నారని, ఆ మేరకు ఆయన మిషన్ రాయలసీమ పేరుతో టిడిపి అధికారం చేపట్టిన వెంటనే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటారన్నారు. మిషన్ రాయలసీమ ప్రణాళికను సమన్వయం చేసుకునేందుకు రాష్ట్ర తెలుగు యువత ప్రతినిధులకు చోటు కల్పిస్తూ జిల్లాకు ముగ్గురు సమన్వయకర్తలను నియమించిందన్నారు. ఇందులో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రెటరీలు జియావుద్దీన్, రవితేజారెడ్డి ఉన్నారన్నారు. తనపై ఎంతో నమ్మకంతో నియమించిన లోకేష్‌కు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబు, ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మిషన్ రాయలసీమను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా చర్యలు తీసుకోవాలని పార్టీ ఆదేశించినట్లు నాగరాజు తెలిపారు.

నల్లబోతుల నాగరాజు

ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతం

దువ్వూరు : మండలంలోని గుడిపాడులో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైందని ఎస్‌ఎల్‌ఆర్ హాస్పిటల్ డాక్టర్ మూలే రామ అనిరెడ్డికుమార్‌రెడ్డి తెలిపారు. శిబిరాన్ని మైదుకూరు బద్వేలు రోడ్డుకు చెందిన ఎస్‌ఎల్‌ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. 300 మందికి షుగర్, బిపి, ఈసిజి, సిబిపి, ఎఇసి అవసరమైన వారికి లిపిడ్, ప్రొఫైల్ హెచ్‌బి ఎ1సి ఒక్కొక్కరికి రూ.1500 విలువైన పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన మందులు ఇచ్చామన్నారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని, యోగా చేయాలని డాక్టర్ సూచించారు. కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ పివి రమణారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ రాజేంద్ర, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

టైర్ పేలి బస్సును ఢీకొన్న లారీ

- చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని వెంకటాపురం గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం తాడిపత్రి వైపు నుంచి గ్రానైట్ లోడుతో కడప వైపునకు వస్తున్న ఎపి16 టిజె 7177నంబర్ గల భారీ లారీ ముందు టైర్ పేలి అదుపు తప్పింది. కొండాపురం నుంచి తాడిపత్రి వైపు వెళుతున్న ఆర్‌టిసి బస్సు (ఎపి 02జెడ్ 6665)ను ఢీ కొంది. బస్సు వెనుక టైర్లు ఊడిపోయాయి. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ అజయ్ బాబు (25) తీవ్రంగా గాయపడ్డాడు. బస్సులోని నలుగురు ప్రయాణికులు గాయ పడినట్లు తాళ్ల ప్రొద్దుటూరు ఎస్‌ఐ మోహన్ తెలిపారు. పోలీసులు, స్థానికుల సా యంతో గాయపడిన వారిని 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన లారీ డ్రైవర్ అజయ్‌బాబు చికిత్స పొందుతూ మృతి చెంది నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడు విజయవాడకు చెందిన వ్యక్తి అని తెలిపారు.

లారీ డ్రైవర్ అజయ్ బాబు

అమృత నగర్ సచివాలయంలో చోరీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కొత్తపల్లి పంచాయతీ అమృతనగర్ 5వ సచివాలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. శనివారం రాత్రి సమయంలో రాత్రోత్రి సచివాలయం తలుపులు పగులగొట్టి కంప్యూటర్లు, బ్యాటరీలు, ఫ్యాన్లు, ప్రింటర్ ధ్వంసం చేశారు. ఉదయం విధులు నిర్వహించడానికి వచ్చిన సిబ్బంది తలుపులు తెరచి చూడగా ఏం జరిగిందో తెలియక భయాందోళన చెందారు. సిబ్బంది తెలిపారు. అనంతరం అధికారులకు తెలియజేశారు. సచివాలయ కార్యదర్శి సుమ స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న రూరల్ ఎస్‌ఐ చిరంజీవి ఆధ్వర్యంలో చోరీ ఘటనపై విచారణ చేపట్టారు. ఇది అల్లరి మూకల పనా.. దొంగలు చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాటరీని ధ్వంసం చేసిన దుండగులు

ట్రాన్స్‌కో ఎడిఇకి తప్పిన ప్రమాదం

పర్మినెంట్ డ్రైవర్ లేకపోవడమే కారణమా..?

ప్రజాశక్తి-కొండాపురం

మండల ట్రాన్స్‌కో ఎడిఇ గోవర్ధన్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం ఆయన దైవదర్శనానికి వెళ్లి వాహనంలో వస్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. గుంటూరుకు చెందిన గోవర్ధన్ కొండాపురం 220కెవి జికెఎల్‌ఐఎస్, తిరుమలాయపల్లె 220 కెవి, తిమ్మాపురం 400 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లను పర్యవేక్షిస్తున్నారు. ఒక్కో సబ్‌స్టేషన్‌కు ఒకొక్కరు చొప్పున విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ ఈయన ఒక్కరే నాలుగింటిని పర్యవేక్షిస్తున్నారు. ఈయనకు కాంట్రాక్టు పద్ధతిపై వాహనాన్ని సమకూర్చినది. వాహన యజమాని కండీషన్ కలిగిన వాహనం, ఇన్సూరెన్స్, లైసెన్స్ కలిగిన డ్రైవర్, డీజిలు, ఆయిల్‌ను సమకూర్చాల్సి ఉంది. ట్రాన్స్‌కో సంస్థ అద్దె డబ్బులు చెల్లిస్తుంది.

డ్రైవర్ లేకపోవడమే ప్రమాదానికి కారణమా..!

ఎడిఇ వాహనానికి డ్రైవర్ లేకపోవడమే ప్రమాదానికి కారణమనే వాదన వినిపిస్తోంది. ప్రమా దానికి గురైన వాహనానికి మూడేళ్లుగా డ్రైవర్ లేకుండానే నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని లైసెన్స్‌లు కలిగిన నిపుణుడైన డ్రైవర్‌ను నియమించుకుని వ్యక్తిగత అవసరాలకు గాకుండా విధులకు మాత్రమే వాహనాన్ని వినియోగించి ఉంటే ప్రమాదం చోటుచేసుకుని ఉండేది కాదనే వాదన వినిపిస్తోంది. సంబంధిత అధికారి, వాహన యజమానితో కుమ్మక్కై వాహనానికి డ్రైవర్ లేకుండానే వాహనాన్ని నడ పడమే ప్రమాదానికి కారణమనే విమర్శ వినిపిస్తోంది. వాహన యజమానికి వాహనానికి డ్రైవర్ను ఏర్పాటు చేసి అద్దెకు ఇవ్వాల్సి ఉంది. కానీ డ్రైవర్‌కు ఇవ్వాల్సిన జీతమును అధికారులు నొక్కుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి నిపుణుడైన డ్రైవర్‌ను ఏర్పాటు చేయాల్సి అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. శుక్రవారం చోటు చేసుకున్న వాహన ప్రమా దంలో హెల్పర్ లేకపోవడం ఊపిరిపీల్చుకోవాల్సిన అంశం. డ్రైవర్ లేకుండా హెల్పర్‌ను ఉపయో గించడం వల్ల ఏదైనా ప్రమాదం వాటిల్లితే బాధ్యులెవరో అధికారులే చెప్పాల్సి ఉంది. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కాగా ఈ విషయంపై అధికారులను వివరణ కోరడానికి ప్రయత్నించగా కొండాపురం ఎడిఇ, యర్రగుంట్ల డిఇ అధికారులు ఫోన్‌లు తీయలేదు, విద్యుత్ ఎస్ఇని ఫోన్‌లో సంప్రదించగా కింద స్థాయిలో అధికారులతో మాట్లాడాలని చెప్పారు.

శుక్రవారం ప్రమాదానికి గురైన వాహనం

అల్లర్లను అరికట్టలేని ప్రభుత్వం గద్దె దిగాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మణిపూర్ అల్లర్లను అరికట్టలేని బిజెపి ప్రభుత్వం తక్షణమే గద్దె దిగాలని భారత ప్రజాతంత్ర యువజన సమైఖ్య,భారత విద్యార్థి ఫెడరేషన్ డిమాండ్ చేసింది. మణిపూర్ బిజెపి పాలిత రాష్ట్రంలో జరుగుతున్న అరాచకత్వంపై ప్రధానమంత్రి మాట్లాడాలని స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో ఆదివారం విద్యార్థినులతో కలిసి ప్లకార్లు పట్టుకొని డివైఎఫ్ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ మణిపూర్ ఘటన దేశాన్ని కలచివేసినా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మౌనం వీడి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోలేదన్నారు. మహిళల పట్ల బిజెపి ప్రభుత్వ వైఖరి అర్థమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన జరిగి 70 రోజులు గడుస్తున్నా కనీసం ప్రధానమంత్రి స్పందించకపోవడం దారణమన్నారు. ప్రతిపక్షాలు ఎంత మొరపెట్టుకున్నా తనకు సంబంధం లేనట్టుగా దేశ ప్రధాని ఉన్నారన్నారు. మహిళల భద్రతా పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. రెండు నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో ఇంటర్నెట్ లేకుండా చేయడం.. అక్కడ జరుగుతున్న ఘోరాలను బయటకి తెలీయకుండా నిందితులకు సపోర్ట్ చేయడం బిజెపి ప్రభుత్వానికి చెల్లుతుందన్నారు. హింసాత్మక ఘటనలకు కేంద్రం, మణిపూర్ రాష్ట్ర బిజెపి ప్రభుత్వాలు బాధ్యత వహించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో రమేష్, బాషా పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న సంఘ నాయకులు, విద్యార్థులు

వామ్మో.. కాంచరకాయ కిలో రూ.240

కాంచరకాయలు కొంటున్న మహిళలు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

కాంచరకాయలను మార్కెట్లో కొనే పరిస్థితి లేదని మహిళలు పేర్కొంటున్నారు. దాని ధరలు కొండెక్కాయి.. ఇప్పుడిప్పుడే అవి మార్కెట్‌లోకి వస్తున్నాయి. అయినా కాంచరకాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని తెలిపారు. చికెన్ ధరలకు దాదాపు సమానంగా సరితూగుతున్నాయి. ప్రస్తుతం వీటిని కిలో రూ.240కు విక్రయిస్తున్నారు. వర్షాభావం వల్ల ఈ ప్రాంతంలో కాంచర కాయలు లభించలేదు. ప్రస్తుతం వీటిని అనంతపురం జిల్లా తాడిపత్రి, గుత్తి, బళ్లారి, తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని వ్యాపారులు విక్రయిస్తున్నారు. రవాణా ఛార్జీలు పెరగడం వల్ల కాంచరకాయల ధరలు కూడా పెంచాల్సి వస్తోందని వ్యాపారులు అంటున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే కాంచర కాయలు రావడం మొదలవుతుంది. ముఖ్యంగా వేరుశనగ పంటలో వీటి ఉత్పత్తి కనిపిస్తుంది. తొలకరి చినుకుల అనంతరం జూన్, జులై నెలలో వీటి ఉత్పత్తి ఉంటుంది. అయితే కాలక్రమైణా వివిధ కారణాల వల్ల ఖరీఫ్‌లో ప్రధానంగా సాగు చేసే వేరుశనగ పంట విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ఈ క్రమంలో కాంచరకాయల ఉత్పత్తి కూడా తగ్గిపోయింది. కాంచరకాయలు కూడా ఆరోగ్యానికి మిక్కిలి శ్రేష్టం. వీటిలో కాస్త చేదు వగరు ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరూ వీటిని తినడానికి ఇష్టపడతారు. కాంచర కాయలను చూస్తే ప్రతి ఒక్కరికీ నోరూరుతుంది. సీజన్ సమయంలో వీటిని కొనుగోలు చేసి బాగా ఎండబెట్టిన తర్వాత నిల్వ ఉంచుకొని ఆ తర్వాత కొన్నాళ్లకు వీటిని ఆరగించడం జరుగుతుంది. వీటి ధర ఎక్కువగా ఉండడంతో పేద, మధ్య, సామాన్య తరగతి ప్రజలకు రుచింపలేదు. అయితే ఇప్పుడిప్పుడే ఇవి మార్కెట్లోకి రావడం వల్ల వీటి ధరలు ఎక్కువగా ఉన్నాయని కొన్నాళ్లు గడిస్తే వీటి ధరలు కూడా తగ్గుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. అయితే వర్షాభావ పరిస్థితుల వల్ల కాంచరకాయల కొరత కనిపిస్తోంది. రుతుపవనాల ప్రభావం ఇతర ప్రాంతాల్లో ఉన్నా ఈ ప్రాంతంలో మాత్రం ఉసురుమనిపించాయి. అదును దాటుతున్న ఇంతవరకు చినుకు జాడలేదు. ఈ పాటికి పదును వర్షాలు వచ్చి ఉంటే కాంచరకాయలు కూడా విరివిగా లభ్యమయ్యేవి. రుతుపవనాల ప్రభావం కాంచర కాయలపై పడిందని చెప్పవచ్చు.

సంఘటితంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

టూ వీలర్ మెకానిక్ కార్మికులు అందరూ సంఘటితంగా ఉండి సమస్యలను పరిష్కారించుకోవాలని నవ్యాంధ్ర టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుబహాని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఉర్దూ ఘర్ షాదీఖానాలో నవ్యాంధ్ర టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గం ఏర్పాటు సందర్భంగా ఉర్దూ ఘర్ షాదీఖానా నుండి కడప-పులివెందుల-గాంధీ రోడ్డులో టూ వీలర్ మెకానిక్‌లు ర్యాలీ నిర్వహించారు. గాంధీ రోడ్డులో ర్యాలీగా వస్తున్న వ్యవస్థాపక అధ్యక్షుడు సుబహాని, రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లి సాంబశివరావు, మండల అధ్యక్షుడు దర్బార్, ఉపాధ్యక్షులు సయ్యద్, జిల్లా అధ్యక్షుడు బహుదూర్ ఖాన్‌కు టిడిపి మైనార్టీ నేత నిమ్మ కాయల మహమ్మద్ దర్బార్ గజమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం షాదీఖానాలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గం ఏర్పాటు చేసి ఎన్నికైనా సభ్యులకు ఘనంగా సన్మానించి మెమొంట్‌లను పంపిణీ చేశారు. సుబహాని మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల లాగానే టూ వీలర్ మెకానికులకు గుర్తించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. వెల్ఫేర్ అసోసియేషన్‌లో సభ్యత్వం ఉన్న వారికి ఆపదలో ఆర్థికసాయం చేసేందుకు ముందుంటుందని చెప్పారు. ఎస్ఐ తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ టూ వీలర్ మెకానిక్ వృత్తిదారులు అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. ఎస్ఐ మెకానిక్ సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులు అందజేశారు. డాక్టర్ నూరి పర్వీన్, నవ్యాంధ్ర టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాంబశివరావు, జిల్లా అధ్యక్షుడు బహుదూర్ ఖాన్, అయాన్ బజాజ్ షోరూం ఎండి డాక్టర్ ఇబ్రహీం, ఆయా జిల్లాల్లోని మెకానిక్ అసోసియేషన్ సభ్యులు, అధ్యక్షులు, కార్మికులు పాల్గొన్నారు.


సభ్యులను గజ మాలలతో సన్మానిస్తున్న నిమ్మకాయల మహమ్మద్ దర్బార్

వేంపల్లె మండల శాఖ అధ్యక్షులుగా దర్బార్

నవ్యాంధ్ర టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షులుగా దర్బార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు సాంబశివరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షులుగా సయ్యద్, జిల్లా కమిటీ సభ్యులుగా గఫార్, సెక్రటరీ ఖాజా, గ్రీన్ ఇండియా అధ్యక్షులుగా బాబాఫకృద్దీన్, ట్రెజరర్ రఫీ, గౌరవ అధ్యక్షులుగా నాయబ్ రసూల్, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

రేపు విద్యా సంస్థల బంద్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25న విద్యాసంస్థల బంద్‌ను చేపట్టామని, జయప్రదం చేయాలని టిఎన్ఎస్ఎఫ్, ఎఐఎస్ఎఫ్, పిఎస్‌యు, ఎఐఎస్‌బి, ఆర్ఎస్‌వైఎఫ్, ఆర్ఎస్ఎ విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఆ మేరకు వారు ఆదివారం ఆర్అండ్‌బి కార్యాలయంలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కాలేజీలలో ఇంతవరకు పూర్తిగా పాఠ్య పుస్తకాలు అందలేదన్నారు. పేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే జిఒ నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు గోరిగెనూరు సుధీర్‌రెడ్డి, సుబ్బరాయుడు, జయవర్ధన్, నాగేంద్ర, వలరాజు, ఈశ్వర్ నాయక్, భానుప్రకాష్, పార్థసారథి, శుభహన్, లక్ష్మణ్, తిరుమలయ్య పాల్గొన్నారు.

వంకను తలపిస్తున్న రోడ్డు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని బిదినంచెర్ల వద్ద రోడ్డుమీద మురుగునీరు నిలిచి వంకను తలపిస్తోంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింహాద్రిపురం- వెల్లిదండ్ల ప్రధాన రోడ్డులో బిదినంచర్ల ఆసుపత్రి సమీపంలో రోడ్డుపై నీరు నిలువ ఉండడంతో పాద చారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లలోని కుళాయిల వద్ద నుంచి వృథా నీటితోపాటు మురుగునీరు వచ్చి నిల్వ ఉంటోంది. గతంలో ఇదే ప్రాంతంలో నీరు నిల్వ ఉండడంతో తాత్కాలిక మరమత్తు చేపట్టారు. అయినా ఫలితం లేకుండా పోయింది. అధికారులు స్పందించి తక్షణమే శాశ్వత మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై నిలిచి ఉన్న మురుగునీరు

ప్రమాదకరంగా పాతబావి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అయ్యవారిపల్లె ఎస్సీ కాలనీలో సుమారు 20 అడుగుల లోతుగల పాడు బడిన బావి ప్రమాదకరంగా మారింది. గతంలో వర్షం నీరు ఇంకడానికి దీన్ని తవ్వారు. తర్వాత పర్యవేకణ లేకపోవడంతో నీరు మురికిగా మారి బురద కుంటగా తయారైంది. వారం క్రితం ఈ బావి సమీపంలో చిన్న పిల్లలు ఆడు కుంటూ బావిలోకి జారి పడిన సంఘటన చోటుచేసుకుంది. వెంటనే అక్కడున్న స్థానికులు అప్రమత్తమై వారిని కాపాడడంతో పెద్ద ప్రమా దం తప్పింది. గతంలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మురికి గుంతగా ఉన్న బావిని పూడ్చాలని లేదంటే ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అయ్యవారిపల్లె ఎస్‌సి కాలనీలోని బావి

మణిపూర్ ఘటన శోచనీయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సోమవారం ప్రొద్దుటూరులో జరగబోయే బిఎస్‌పి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా ఇన్‌ఛార్జులు పందిటి బాబు, కానుగ దానం కోరారు. స్థానిక బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షులు కమల్ బాషా ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశానికి వారితోపాటు ప్రధాన కార్యదర్శి గుడిసెన పల్లి ఓబయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా మణిపూర్‌లో జరిగిన దుర్ఘటనపై తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో వైసిపి, దేశంలో బిజెపి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓటు బ్యాంక్‌గా చూస్తున్నారే తప్ప మనుషులుగా చూడడం లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ, ప్రతిపక్ష టిడిపి, మార్పు తీసుకొస్తా మం టున్న జనసేన మణిపూర్ వంటి సంఘటనలను ప్రోత్సహిస్తున్న బిజెపితో పొ త్తుకు తహతహలాడుతున్నాయని విమర్శించారు. బహుజనులపై వారి విధా నం ఎలాంటిదో ఇట్టే గ్రహించొచ్చని తెలిపారు. ఇప్పటికైనా బహుజనులు, అణ గారిన వర్గాలు అర్థం చేసుకొని బలహీనవర్గాల పక్షమైన బిఎస్‌పి బలోపేతానికి సహకరించాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు సహకరించినప్పుడే దేశంలో రాజ్యాంగం సంపూర్ణంగా అమలవుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్లు వెంకట నారాయణ, ఆనంద్, జోసఫ్, పెంచలయ్య పాల్గొన్నారు.

సమావేశమైన బిఎస్‌పి నాయకులు

ఆకలి అనుభవంతోనే 'రాజన్న భోజనం'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గ్రామీణ ప్రాంత పేద రైతు కుటుంబంలో జన్మించిన వాడిగా పేదల ఆకలి ఎలా ఉంటుందో తాను అనుభవించానని, అందుకే పేదల ఆకలి తీర్చాలనే సంకల్పంతో రాచమల్లు వారి రాజన్న భోజనం ఏర్పాటు చేశానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఏ స్వార్థం ప్రయోజనాలు ఆశించకుండా పూర్తిగా పేదల ఆకలి తీర్చేందుకే రాజన్న భోజనం ప్రారంభించామని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు తన గత జీవన విధానం పేదరికం అనుభవించిన వాడిగా మానవత్వపు విలువలు గల వ్యక్తిత్వం ఉంటేనే చేపడతారన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎవరు చేసినా వారిని మనస్ఫూర్తిగా అభినం దిస్తానన్నారు. ఈ కార్యక్రమాన్ని 11ఏళ్లపాటు నిర్విరామంగా నిర్వహించాలన్నదే తన లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ రాజమల్లు వారి రాజన్న భోజనం కేంద్రాన్ని సందర్శించి సంతృప్తిగా భోజనం చేయాల్సిందిగా ఆహ్వాని స్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 నుండి 2.30 గంటల వరకు వచ్చే వారం దరికీ భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, రాయలసీమ పోలీసు కంప్లైంట్ అథారిటీ సభ్యులు కాకర్ల నాగశేషారెడ్డి, కౌన్సిలర్ వరుకూటి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

'కస్తూర్బా' సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థిని అస్వస్థతకు గురైనా, ఆస్పత్రికి తరలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూర్బా బాలికల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న హబీషా శనివారం రాత్రి బాత్ రూమ్‌లో కిందపడి అస్వస్థతకు గురైందన్నారు. సిబ్బంది ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. సమాచారాన్ని కనీసం ఫోనులో కూడా తల్లిదండ్రులకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం విద్యార్థిని తల్లి పాఠశాలకు వెళ్లగా అప్పటికే మాట్లాడలేని స్థితిలో విద్యార్థిని ఉందన్నారు. వెంటనే విద్యార్థిని తల్లి, బంధువులు హబీషాను ఆస్పత్రికి తరలించారని తెలిపారు. పరిస్థితి సీరియస్‌గా ఉన్నా, కనీసం సిబ్బంది ఆస్పత్రికి కూడా వెళ్లకపోవడం భాధకరమన్నారు. మెరుగైన వైద్యం కోసం బాలికను పోరుమామిళ్ల ప్రయివేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి డాక్టర్ సలహా మేరకు రిమ్స్‌కు తరలించారని తెలిపారు. సంఘటనపై ఎస్ఎస్ఎ పిఒ ప్రభాకర్‌రెడ్డికి ఫోన్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు ఫిర్యాదు చేశారు. పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఎద్దు రాహుల్, జిల్లా కమిటీ సభ్యులు సుమంత్, నాయకులు రవి పాల్గొన్నారు.

విద్యార్థిని పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎస్‌సి వర్గీకరణ సాధనకు ఆగస్టు రెండో వారంలో హైదరాబాదులో 20 లక్షల మంది మాదిగలతో జరుగు విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఉమ్మడి కడప జిల్లా కన్వీనర్ వెలగచర్ల శివయ్య మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక హోంలో ఎంఆర్‌పిఎస్, అనుబంధ సంఘాల సమావేశాన్ని జిల్లా ఎంఇఎఫ్ అధ్యక్షులు పిచ్చికె బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో 8 శాతంపైగా ఉన్న మాదిగ, మాదిగ ఉప కులాలను అన్ని రాజకీయ పార్టీలు మోసం చేశాయని విమర్శించారు. ఎస్‌సి వర్గీకరణకు సహకరించని పార్టీలకు 2024 ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికైనా న్యాయబద్ధమైన ఎస్‌సి వర్గీకరణపై రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం ఎస్‌సి వర్గీకరణ బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జమ్మలమడుగు నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో ప్రచార నిమిత్తం చలో హైదరాబాద్ ప్రచార రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎపి జెన్‌కో ఆర్టిపిపి ఎంఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె సాల్మన్, ఉపాధ్యక్షులు కె ఓబులేసు, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మానికింద వెంకటేష్, కో కన్వీనర్ శ్రీనివాసులు, ఎంఎస్‌పి నాయకులు వై చిన్నయ్య, నరసింహులు, గంగరాజు, చంద్రకుమార్, రాజు, పుల్లన్న, దస్తగిరి, నాగన్న, ఓబులేసు, చంద్ర, గురుశేఖర్, రాముడు, చంటి, నాగరాజు, శంకర్, మురళి, ప్రతాప్, బ్రహ్మం, ఎంఇఎఫ్ నాయకులు కె బాలఓబయ్య, కె కొండయ్య, ఓబులేసు, కిరణ్ పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న మాదిగ సంఘాల నాయకులు

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

వాహనాలను నడిపే వారు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి సూచించారు. ఆదివారం బస్టాండ్ కూడాలీలో ఆటో యజమానులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంతోపాటు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని, యూనిఫామ్ ధరించడం తప్పనిసరి అని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ట్రాఫిక్ నియమాల గురించి వివరిస్తున్న ఎస్ఐ